

ప్రజాసేవ, సామాజిక ప్రభావం, కార్పొరేట్ నాయకత్వంలో ప్రతిభ చాటుతూ ఐఓడీ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025, గోల్డెన్ పీకాక్ అవార్డులు లండన్‌లో అందుకోనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ శ్రీమతి నారా భువనేశ్వరి గారికి మనఃపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



శనివారం 01.11.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 195 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## రాజధాని కల సాకార దిశగా...

# అమరావతి పనులు వేగవంతం

**• జాప్యం లేకుండా రాజధాని నిర్మాణ పనులు జరగాలి • నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి**

**• పెండింగులో ఉన్న రిటర్నబుల్ ప్లాట్లను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలి • సీఆర్డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలని చెప్పారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు..? వర్క్ ఫోర్స్ ఏ మేరకు ఉంది..? నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనేదానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్ధిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆ మేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణాల్లో వేగంతో పాటు.. నాణ్యత ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత మేర జాప్యం జరిగినా.. రానున్న రోజుల్లో దాన్ని భర్తీ చేసేలా నిర్మాణాల్లో వేగం పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇంకా కొన్ని నిర్మాణ సంస్థలు వర్క్ ఫోర్స్, మెషీనరీని పూర్తి స్థాయిలో కేటాయించలేదని... ఇలా ఉన్న సంస్థలు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాజధాని భవనాల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ మేరకు గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు.

**రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు :** రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు పూర్తైందని సీఎం ఆరా తీశారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు రానివ్వొద్దని మంత్రి నారాయణ, అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు అధికారులు అందించారు. ఇంకా 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని.. ఇవి కూడా చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తాను కూడా త్వరలోనే రాజధాని రైతులతో సమావేశమవుతానని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నామో.. గ్రీనరీ, సుందరీకరణ,

మిగతా 2లో...



## తుఫాన్ నష్టంపై 24 గంటల్లో

# పూర్తి కార్యాచరణ

**పంటపొలాల్లో యుద్ధప్రాతిపదికన నీటి నిల్వలు మళ్లింపు**

**శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24 గంటల్లో పూర్తి కార్యాచరణ**

**ఆస్తినష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించండి**

**తుఫాన్ విధుల్లో ప్రతిభ చూపిన 100 మందికి సన్మానం**

**టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగతా 2లో...

## మొంథా తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ స్వాంతన కలిగించి, న్యాయం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలు పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ప్రకటించిన సాయం నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. సముద్రానికి ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఆర్ఓ, ఆర్డీవోలు, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, వ్యవసాయ, విద్యుత్ శాఖలతోపాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను అనంతర పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో జరిగిన నష్టం వివరాలపై ఆరా తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తుపాను అనంతరం తీసుకుంటున్న ఉపశమన చర్యలు, ఆస్తి, పంట నష్టం అంచనాలపై దిశా నిర్దేశం చేశారు. కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 21 మండలాలు, ఏడు మున్సిపాలిటీలు ప్రభావితం అయినట్టు కలెక్టర్ శ్రీ షాన్ మోహన్ వివరించారు. మొత్తం 61 ఇళ్లు దెబ్బ తినగా, 41,932 కుటుంబాలపై మొంథా ప్రభావం చూపినట్టు తెలిపారు. అందులో 27,624 మత్స్యకార, 313 చేనేత కుటుంబాలు ఉన్నట్టు చెప్పారు. 21, 711 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, 668 ఎకరాల్లో అరటి, బొప్పాయి తదితర

మిగతా 2లో...

## మైనారిటీలకు ఉచిత 'టెట్" కోచింగ్



- **ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోచింగ్ కు ఏర్పాట్లు**
- **మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలి**
- **రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

# మెగా రైల్ టెర్మినళ్లుకు సన్నాహాలు

- **8 ప్లాట్‌ఫామ్స్‌తో అమరావతి టెర్మినల్ నిర్మాణం**
- **విజయవాడ రైల్వే స్టేషన్ సామర్థ్యం పెంపు**
- **నిత్యం 300 రైళ్ల రాకపోకలకు ఏర్పాట్లు**
- **గుంటూరు రైల్వే స్టేషన్ లో 170 రైళ్ల రాకపోకలకు ప్లాన్**
- **టెర్మినల్స్ ఏర్పాటుకు 300 ఎకరాలు కోరిన కేంద్ర రైల్వేశాఖ**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ రాజధాని అమరావతిని రైల్వేల అభివృద్ధికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా గన్నవరంలో మెగా రైల్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.

రాజధాని ప్రాంతంలో విమానాశ్రయం ఉన్న గన్నవరంలలో మెగా టెర్మినళ్లు నిర్మించేందుకు రైల్వేశాఖ ప్రణాళిక సిద్ధంచేసింది. అమరావతి మీదుగా భవిష్యత్‌లో పెద్దఎత్తున రైళ్ల రాకపోకలు సాగనుండటంతో.. వాటికి అనువుగా 8 ప్లాట్‌ఫాంలతో టెర్మినల్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ రైళ్ల నిర్వహణ పనులు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే విజయవాడ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేలా గన్నవరం టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నారు. వీటితోపాటు విజయవాడ ప్రధాన స్టేషన్, గుంటూరు స్టేషన్ మీదుగా మరిన్ని ఎక్కువ రైళ్ల రాకపోకలకు వీలుగా విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. త్వరలో ఈ ప్రణాళికను అమలు చేసేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అమరావతిలో 120 రైళ్ల రాకపోకలకు వీలుగా అధునాతన వసతులు, ప్రణాళికతో రూపొందిస్తారు. రాజధాని మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 56 కి.మీ. మేర కొత్త రైల్వేలైన్ నిర్మిస్తున్నారు.

2లో...

# ప్రపంచ పర్యాటక యవనికపై ఏపీని నిలబెడుతాం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యాటక యవనికపై ఏపీని నిలబెడుతామని మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ నవంబర్ 4 నుండి 6 వరకు లండన్ లో పర్యటించనున్నారు. సుస్థిర పర్యాటక రంగ వృద్ధి, డిజిటలైజేషన్ చేయడం, ఇన్ బౌండ్ టూరిజంను మెరుగుపరిచే ఉద్దేశంతో మూడు రోజుల పాటు లండన్ దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)-2025 సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లండన్ లో 30 మంది ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకానికి ప్రమోషన్ కల్పించనున్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను, విప్లవాత్మక నిర్ణయాలను వెల్లడించి అక్కడికి వచ్చే ఇన్వెస్టర్లను ఆకర్షించనున్నారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా ఏపీ స్టాల్ ను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అద్భుతమైన సహజ సిద్ధ ప్రదేశాలు, చరిత్ర, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిపేలా ప్రచారం చేయనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాల ఛాయాచిత్రాల ప్రదర్శనను ప్రదర్శించనున్నారు. అంతేగాక ఏపీ బృందంతో పాటు ప్రఖ్యాత స్టేక్ హోల్డర్స్ ను, ట్రావెల్ ఆపరేటర్లను తీసుకెళ్లనున్నారు. అక్కడికి వచ్చే ప్రతినిధులకు కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి, అరకు కాఫీని, ఆంధ్రా ఫేమస్ పూతరేకుల రుచి చూపించడంతో పాటు జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను బహుమతిగా అందించనున్నారు.

మిగతా 2లో...

# తుఫాన్ పంట నష్టంపై ప్రభుత్వం తక్షణ చర్యలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో, పంట రక్షణ చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాయింట్ డైరెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల కష్టానికి ప్రతిఫలం లభించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్న తెలిపారు. పంట నష్టం తగ్గించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, గ్రౌండ్ వాటర్ మరియు మెట్రోలాజికల్ అధికారులతో సమన్వయం కలిగి పనిచేయాలని సూచించారు. ప్రతి మండల వ్యవసాయాధికారి స్థాయిలో పంట నష్టం అంచనాలు ఖచ్చితంగా సేకరించి, రైతులకు తక్షణ ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో శాస్త్రవేత్తల సహాయంతో పంట రక్షణ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. రైతుల సమస్యలు, నష్టాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక అందించాలని, వాటిని త్వరగా ప్రభుత్వానికి సమర్పించి సాయం అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతు భవిష్యత్తు మనకు ప్రాధాన్యం. ప్రతి ధాన్యపు గింజ విలువైనది. రైతుకు నష్టం రాకుండా ప్రతి అధికారి నిబద్ధతతో వ్యవహరించాలి అని పేర్కొన్నారు. గురువారం క్రిష్ణా జిల్లాలో పంట ముంపు ప్రాంతాలు పర్యటించినప్పుడు రైతులు తమ పంట నష్టం క్రింద నమోదు చేసుకుంటే ఆ భూమిపై పండిన వరి అమ్ముకోడానికి అవ్వదు అని రైతులు నాతో చెప్పుకున్నారని, వ్యవసాయశాఖ మరియు సివిల్ సప్లయి డిపార్ట్మెంట్ వాళ్లతో మాట్లాడటం జరిగింది.

మిగతా 2లో...

# మంత్రి సత్యకుమార్ చొరవతో.... ఇక నిరాటంకంగా ఎన్టీఆర్ వైద్య సేవలు



**• అశా ప్రతినిధులు మంత్రి సత్యకుమార్, మధ్య చర్చలు సఫలం • నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పునః ప్రారంభం**

**• మూడో విడత కింద రూ.250 కోట్లు విడుదలకు అంగీకారం • వన్ టైం కింద బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం సంసిద్ధత**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్ అసోసియేషన్ (అశా) ప్రతినిధుల మధ్య శుక్రవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. వీరి ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి మంత్రి చూపిన చొరవతో వైద్య సేవలను తక్షణమే కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి హామీ ఇవ్వడంతో పాటు పత్రికా ప్రకటన జారీ చేశారు.

రాష్ట్ర సచివాలయంలోని మంత్రి సత్యకుమార్ ఛాంబరులో మంత్రి, అసోసియేషన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ప్రభుత్వ బకాయిలను వన్ టైం కింద చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆశా ప్రతినిధులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ...." ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సమస్యల పరిష్కారం గురించి ఎప్పటికప్పుడు చర్చించాను. వన్ టైం చెల్లింపు విధానంలో సమస్య శాశ్వత పరిష్కారానికి సిఎం సిద్ధంగా ఉన్నారు. వన్ టైం చెల్లింపు విధానం అమల్లోకొచ్చేలోగా మరో రూ. 250 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటా. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద తీసుకునే నిర్ణయాల్లో సంఘం ప్రతినిధులను భాగస్వాములను చేస్తా. పెండింగులో ఉన్న ఆసుపత్రుల బిల్లుల పరిశీలనలకు యుద్ధప్రతిపాదికన సుమారు 50 మంది వైద్యులను నియమిస్తున్నాం. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున రోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సేవలను కొనసాగించాలి " అని తెలిపారు.

**2 విడతల్లో ఇప్పటికే రూ.488 కోట్లు చెల్లింపు**

బకాయిలను వెంటనే వెల్లించాలని కోరుతూ అక్టోబరు 10 నుంచి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు సేవలు నిలిపివేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు మంత్రి సత్యకుమార్ చొరవతో ప్రభుత్వం

మిగతా 2లో...

# రాజధాని కల సాకార దిశగా... అమరావతి పనులు వేగవంతం



(మొదటి పేజీ తరువాయి)

పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానుల గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ వంటి వాటిల్లో ఎలాంటి రాజీపడొద్దని సూచించారు. ఇక ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్లో ఉండేలా చూడాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరాలని అధికారులకు సూచించారు. అమరావతికి వరల్డ్ క్లాస్ సిటీ లుక్ రావాలంటే హైరెయిజ్ బిల్డింగులు ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఫైనాన్స్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తుఫాన్ నష్టంపై 24 గంటల్లో పూర్తి కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి శనివారం కల్లా మొత్తం నీటిని మళ్లించాలని సీఎం స్పష్టం చేశారు. నియోజకవర్గం వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేసి... ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడకి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. అందరూ కలిసి సమన్వయంతో పని చేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని... పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా ఎక్కువగా 60 శాతం మేర బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బాపట్ల జిల్లాలో మాత్రం ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని విన్నవించారు.

**కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి :** మొంథా తుఫాన్‌తో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెనువెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలన్నారు. తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించేలా కేంద్రాన్ని కోరాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయమై తాను ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే కృష్ణా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి నిల్వల వివరాల గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే కృష్ణాలో వరద ఉధృతి తగ్గిందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. అలాగే మొంథా తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. శనివారం ఉదయం 10 గంటలకు సుమారు 100 మందిని గౌరవించుకునేలా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు.

# మైనారిటీలకు ఉచిత 'టెట్" కోచింగ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర విద్యా శాఖ నిర్వహించబోయే టెట్ పరీక్షకు హాజరయ్యే మైనారిటీ యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ అఫ్ మైనారిటీస్ (సిఈడియం) ద్వారా మైనారిటీలకు ఉచిత కోచింగ్ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. విద్యా శాఖ ఈ ఏడాది డిసెంబర్ 10 న టెట్ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. టెట్ పరీక్షలకు నవంబర్ మొదటి వారం చివరి నుండి మైనారిటీ యువతకు ఉచితంగా కోచింగ్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. టెట్ పరీక్ష కోసం కోచింగ్ ను ఆన్ లైన్ తో పాటు ఆఫ్ లైన్ ద్వారా అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ అవకాశాన్ని మైనారిటీ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. పూర్తి వివరాల కోసం సిఈడియం వెబ్ సైట్ www.apcedmmwd.orgద్వారా టెట్ పరీక్షకు సన్నద్ధమయ్యే మైనారిటీ యువత తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మరింత సమాచారం కోసం సిఈడియం కార్యాలయం, భవానీపురం, విజయవాడ – 5200012కు లేదా ఫోన్ నంబర్లులి లి0866–2970567, 7386789966కు సంప్రదించవచ్చని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# ప్రపంచ పర్యాటక యవనికపై ఏపీని నిలబెడుతాం

(మొదటి పేజీ తరువాయి)

లండన్ పర్యటనలో భాగంగా పలు దేశాల్లో పర్యాటక రంగం ఎలా అభివృద్ధి చెందుతున్నదో అధ్యయనం చేసి ఏపీ పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి తీసుకుంటున్న చర్యలను వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా వినిపించి ఏపీ పర్యాటక రంగాన్ని సరికొత్తగా పరిచయం చేస్తామన్నారు. ఏపీ పర్యాటక రంగాన్ని విశ్వవ్యాప్తం చేయడం వల్ల విదేశీ పర్యాటకుల తాకిడి పెరిగి పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని, తద్వారా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయని భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అన్ని రాష్ట్రాల, పలు దేశాల పర్యాటక బోర్డులు, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, గ్లోబల్ హాస్పిటాలిటీ బ్రాండ్లు, టూర్ ఆపరేటర్లు, డెస్టినేషన్ మేనేజ్ మెంట్ కంపెనీలు తదితర ఇన్వెస్టర్లను ఒకచోట చేర్చే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ప్రదర్శన ద్వారా ఏపీ పర్యాటక వాణిని వినిపించి వినూత్న పెట్టుబడులు ఆకర్షిస్తామని మంత్రి దుర్గేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొనను న్నారు. మంత్రి కందుల దుర్గేష్ ను వరల్డ్ ట్రావెల్ మార్కెట్ –2025లో పాల్గొనేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో నవంబర్ 2వ తేదీన లండన్ పర్యటనకు బయలుదేరనున్నారు.

# మొంథా తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. మొత్తం 33,596 మంది రైతులు తుపాను కారణంగా నష్టపోయినట్టు తెలిపారు. విద్యుత్ పరికరాలు, రోడ్లు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే వరి, ఉద్యాన పంటలు కలిపి 2,500 మంది రైతులు వరకు పంటలు నష్టపోయినట్టు చెప్పారు. అంతటా ఉపసమన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పంట చేతికి వచ్చే సమయానికి తుపాను బారినపడింది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి రాకుండా పోయింది. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకీ ప్రభుత్వం నుంచి పరిహారం అందాలి. కష్టంలో ప్రభుత్వం మాకు తోడుందని రైతు సంతృప్తి చెందేలా యంత్రాంగం చర్యలు ఉండాలి. ముఖ్యంగా పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలచి పక్కాగా నివేదికలు రూపొందించాలి. దీంతోపాటు ఆస్తి నష్టం వివరాలు కూడా రూపొందించాలి. దెబ్బ తిన్న ఇళ్లకు తక్షణం పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలి. తుపాను అనంతరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. గ్రామాల వారీగా పారిశుధ్య కార్యక్రమాలు ఎంత వరకు వచ్చాయో ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించండి. ఎంత మేర రోడ్లు దెబ్బతిన్నాయో గుర్తించి, పాక్షికంగా



దెబ్బ తిన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

**తీర ప్రాంతం మొత్తం తాత్కాలిక రాళ్ల గోడ నిర్మాణానికి చర్యలు :** ఉప్పాడ తీర ప్రాంతంలోని సుబ్బంపేట వద్ద సముద్ర కోత నుంచి రక్షణకు రాళ్లతో తాత్కాలిక రక్షణ గోడ ఏర్పాటు చేశాం. ఇది సముద్రపు కోతను నిలువరించగలిగింది. మిగిలిన తీర ప్రాంత గ్రామాలకు కూడా ఈ రాళ్ల గోడ నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం. శాశ్వత రక్షణ గోడ నిర్మాణం పూర్తయ్యే వరకు ఇది తీర ప్రాంత గ్రామాలకు రక్షణ కల్పిస్తుంది. తీర ప్రాంత గ్రామాల రక్షణకి ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలి" అన్నారు.

**పిఠాపురం నియోజక వర్గంలో పరిస్థితులపై సమీక్ష... :** ఈ సందర్భంగా మొంథా తుపాను అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితులపై శ్రీ పవన్ కళ్యాణ్ గారు సమీక్షించారు. కోతకు గురవుతున్న ఉప్పాడ, మూలపేట, కోనపాప పేట, అమీనాబాద్, సుబ్బంపేటల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయని అధికారుల ద్వారా తెలుసున్నారు. 'మొంథా తుపాను పిఠాపురం నియోజక వర్గం మొత్తం ప్రభావం చూపింది.. తుపాను అనంతరం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగినట్టు సమాచారం వచ్చింది. పిఠాపురం పట్టణం పరిధిలోని కరివేపాకు పేట ప్రాంతం వద్ద పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు ఇంకా నిలిచి ఉన్నట్టు తెలిసింది. ఆ నీటిని తక్షణం బయటికి పంపే ప్రయత్నం చేయాలి. దోమలు పెరిగి, వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యపు చర్యలు చేపట్టాలి అంటు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్న చోట వైద్య శాఖను అప్రమత్తం చేయాలి.

ఏలేరు కాలువ గొర్రెకండె గట్టు వద్ద కొంత బలహీనంగా ఉన్నట్టు తెలిసింది. ముంపు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన కాలువ గట్లు పటిష్టపరచండి. తుపాను కారణంగా మల్లవరం ప్రాంతంలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పత్తి పంట నష్టంపై తక్షణం అంచనాలు రూపొందించి వారికి న్యాయం జరిగేలా చూడాలి' అని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

# మెగా రైల్ టెర్మినళ్లుకు సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో అమరావతి ప్రధాన స్టేషన్‌ను మెగా కోచింగ్ టెర్మినల్‌గా నిర్మించనున్నారు.

ఓ స్టేషన్ నుంచి ప్రయాణికుల కోచ్‌లతో ఉండే రైలు బయలుదేరినా, ఆ స్టేషన్‌తో రైళ్ల గమ్యస్థానం ముగిసినా.. దానిని కోచింగ్ టెర్మినల్‌గా పేర్కొంటారు. అక్కడితో నిలిచిపోయే రైళ్ల కోచ్‌ల నిర్వహణ పనులు కూడా చేపడతారు. అమరావతిలో ఇటువంటి టెర్మినల్ నిర్మించనున్నారు.

8 రైల్వే లైన్లు, ఎనిమిది ప్లాట్‌ఫామ్స్ నిర్మిస్తారు.

ఒక్కో ప్లాట్‌ఫామ్‌పై 24 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన రైళ్లు నిలిచేలా నిర్మిస్తారు. ఈ స్టేషన్ భవిష్యత్‌లో 120 రైళ్ల రాకపోకలకు వీలైన సామర్థ్యం ఉండేలా అభివృద్ధి చేస్తారు.

ఈ స్టేషన్‌తో నిలిచిపోయే రైళ్ల నిర్వహణ పనులకు వీలుగా ఆరు పిట్ లైన్లు నిర్మిస్తారు. వాటిలో ఒకటి వందేభారత్ రైలు కోసం కూడా ఉంటుంది.

మొత్తంగా ఈ టెర్మినల్ కోసం 300 ఎకరాలు అవసరమని రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. 10 ప్లాట్‌ఫామ్స్‌తో గన్నవరం టెర్మినల్ ను నిర్మిస్తారు

గన్నవరం రైల్వే స్టేషన్‌ను కూడా మెగా కోచింగ్ టెర్మినల్‌గా అభివృద్ధి చేయనున్నారు.

ప్రస్తుతం ఈ స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. పరిమితంగా కొన్ని రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి.

ఇకపై దీనిని విజయవాడకు ప్రత్యామ్నాయ స్టేషన్‌గా అభివృద్ధి చేయనున్నారు.

సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు



చర్లపల్లి వద్ద టెర్మినల్‌ను అభివృద్ధి చేశారు. అదేవిధంగా గన్నవరం మెగా టెర్మినల్ నిర్మిస్తారు.

ఇక్కడ మొత్తం 10 రైల్వే లైన్లు, 10 ప్లాట్‌ఫాంలు నిర్మించనున్నారు.

ఈ టెర్మినల్ నుంచి 205 రైళ్ల రాకపోకలు ఉండేలా చూడనున్నారు.

ఈ స్టేషన్‌తో నిలిచిపోయే రైళ్లకు చెందిన కోచ్‌ల నిర్వహణకు వీలుగా 4 పిట్ లైన్స్ కూడా నిర్మించనున్నారు.

గన్నవరం మెగా కోచింగ్ టెర్మినల్‌కు 143 ఎకరాలు కేటాయించాలని రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందివిజయవాడ నుంచి మరిన్ని రైళ్ల రాకపోకలకు వీలుగా.. మీ టర్మినల్స్ ఉంటాయి.

విజయవాడ రైల్వేస్టేషన్ మీదుగా ప్రస్తుతం నిత్యం 200 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, దీనిని 300 రైళ్ల సామర్థ్యానికి పెంచేలా అభివృద్ధి చేయనున్నారు.

ఇప్పుడున్న 1, 2, 3 లైన్లు చిన్నవిగా ఉన్నాయి. దీంతో 28 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతోగాని, 24 ఐసీఎఫ్ కోచ్‌లతో కూడిన రైళ్లను 2, 3, 4 ప్లాట్‌ఫామ్స్‌పై నిలపలేకపోతున్నారు.

దీంతో 1, 2, 3 లైన్లను విస్తరించనున్నారు.

ప్రస్తుతం స్టేషన్‌కు కొంత దూరంలో ఉండే రిసెప్షన్ సిగ్నల్ నుంచి రైళ్లు ఏవైనా గంటకు 15 కి.మీ. వేగంతో మాత్రమే స్టేషన్‌లోకి వస్తున్నాయి. ఇకపై రిసెప్షన్ సిగ్నల్ నుంచి కూడా 40–50 కి.మీ. వేగంతో స్టేషన్‌లోకి వచ్చి ప్లాట్‌ఫాంల వద్ద ఆగేలా అభివృద్ధి చేయనున్నారు.

**గుంటూరులో మరో కొత్త ప్లాట్‌ఫాం**

గుంటూరు స్టేషన్‌లో ప్రస్తుతం ఏడు ప్లాట్‌ఫాంలు ఉండగా, అదనంగా మరోదానిని నిర్మిస్తారు.

ప్రస్తుతం ఈ స్టేషన్ మీదుగా 120 రైళ్ల రాకపోకలు సాగించే సామర్థ్యం ఉండగా, దీనిని 170 రైళ్ల సామర్థ్యానికి పెంచనున్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ మహోన్నతుడు

**ఉమ్మడి గుంటూరుజిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**

సర్దార్ వల్లభాయ్ పటేల్ మహోన్నతుడని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో శుక్రవారం "సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్" ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ సమైక్య దినోత్సవం)లో భాగంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రభుత్వ మహిళా కళాశాల వరకు పెద్ద ఎత్తున సాగింది. మంత్రి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ప్రభుత్వ మహిళా కళాశాల వరకు సాగింది. కళాశాలలో జరిగిన సమావేశంలో అతిథులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

దేశ చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు స్వర్ణాక్షరాలతో లిఖించవచ్చని అన్నారు. వల్లభాయ్ పటేల్‌ను ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తించడం జరిగిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ ఐక్యతను సాధించిన మహానేతగా ఆయనకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 దేశీయ సంస్థానాలను భారత రాజ్యాంగంలో విలీనం చేయించడంలో ఆయన అద్భుత కృషి మరువలేనిది అన్నారు. ధైర్యం, తెలివితేటలు, చర్చా పటిమతో ఈ మహత్తర కార్యక్రమాన్ని పూర్తి చేశారని



కొనియాడారు.

గుంటూరు తూర్పు శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రభావంతో స్వాతంత్ర్య ఉద్యమంలో చేరడం జరిగిందన్నారు. నాయకుడిగా ఆయన రైతులు, కార్మికులు, ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అన్నారు.

గుంటూరు పశ్చిమ శాసన సభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ సర్దార్ పటేల్ పరిపాలనలో క్రమశిక్షణ, న్యాయం, ప్రజాస్వామ్య విలువలు ప్రధానమయ్యాయని వివరించారు. ఆయన భారత పరిపాలన వ్యవస్థకు బలమైన పునాది వేసారని. ఆయన ఆలోచనలు, సేవలు నేటికీ భారత రాజకీయ నాయకులకు ప్రేరణగా నిలుస్తున్నాయని చెప్పారు.


జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడే కాదని, దేశ ఐక్యతకు చిహ్నం అన్నారు. ధైర్యం, దేశభక్తికి ప్రతీక అని, ఆయన త్యాగం, కర్తవ్య నిబద్ధత, దృఢ సంకల్పం భారత యువతకు ప్రేరణ అన్నారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నగర పాలక సంస్థ కమిషనర్ పులి. శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి, స్థానిక నాయకులు తిరుపతి రావు, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు.

# వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అన్నారు. వరకట్న నిషేధ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతనశనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఎక్కువ అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక స్తోమత పెంచడం



అవసరం అన్నారు. వివాహం తర్వాత విధిగా నమోదు జరగాలని స్పష్టం చేశారు. వరకట్న నిషేధ చట్టం ద్వారా వరకట్నం అడగటం, తీసుకోవడం నేరమని, 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 15 వేల వరకు అపరాధ రుసుం వేయడం జరుగుతుందని చెప్పారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన – వరకట్న నిషేధ చట్టం వివరాలను తెలిపారు. జీ.ఓ. 28 ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గృహ హింస చట్టం కింద 2022 సంవత్సరంలో 666 కేసులు, 2023లో 588, 2024లో 483 కేసులు, 2025లో 446 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు.

ఈ సమావేశంలో పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, న్యాయ సలహాదారు విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సత్యకుమార్ చొరవతో... ఇక నిరాటంకంగా ఎన్టీఆర్ వైద్య సేవలు



(మొదటి పేజీ తరువాయి)

రెండు విడతల్లో కలిపి రూ. 488 కోట్లు విడుదలచేసింది. మరో విడత కింద రూ. 250 కోట్లు చెల్లించేందుకు చర్యలు మొదలయ్యాయి. . మిగిలిన బకాయిలను నెట్వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బ్యాంకుల నుండి పొందిన రుణాల ద్వారా వన్ టైం విధానంలో చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కూటమి ప్రభుత్వం చెల్లించిన మొత్తం రూ. 4,143 కోట్లు**

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పట్నించి ఇప్పటివరకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు తరపున ఆసుపత్రులకు రూ. 4,143 కోట్లు చెల్లింపులు జరిగాయి

ఇందులో గత వైకాపా ప్రభుత్వ బకాయిలు రూ. 2,403.92 కోట్లున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వం హయంలో ట్రస్టు ద్వారా జరిగిన వైద్య సేవలకైన మొత్తంలో రూ. 1739.28 కోట్లు చెల్లించింది. ప్రస్తుతానికి చెల్లించాల్సిన బకాయిల విలువ రూ. 2,500 కోట్ల వరకు ఉంది. మంత్రితో ఆశా ప్రతినిధులు జరిపిన చర్చల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సిఇఓ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

# తుఫాన్ పంట నష్టంపై ప్రభుత్వం తక్షణ చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

వారకి పూర్తి సూచనలు (ఇన్ స్ట్రక్షన్స్) ఇవ్వడం జరిగింది. గతంలో SDRF రిలీఫ్ కింద పరిహారం తీసుకున్న వారు అందరికీ ఈ ఇబ్బంది వచ్చింది. కావున ఈ సారి ఆ ఇబ్బంది రాకుండా ఇరు శాఖలకు సూచనలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలియజేశారు.

**వరి పంటకు నష్టాన్ని తగ్గించుకోవడానికి రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి**


మొంథా తుఫాను కారణంగా కృష్ణ, గోదావరి, డెల్టా జిల్లాల్లో వరి పంట పూత దశ, పాలు పోసుకునే దశ మరియు కోత దశల్లో ఉండగా భారీ ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో అనేక వరి చేలు పడిపోయి నీట మునిగిన నేపథ్యంలో, నష్టం తీవ్రత తగ్గించేందుకు రైతులు అత్యవసరంగా కొన్ని కీలక చర్యలు తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పూత దశ నుంచి పాలు పోసుకునే దశ వరకు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే అంతర్గత కాలువల ద్వారా తొలగించడం అత్యంత ముఖ్యం. నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 400 మి.లీ హెక్సాకోనాజోల్ లేదా 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని సూచించారు. పరిస్థితులు అనుకూలిస్తే పడిపోయిన చేలను పైకి లేపి కట్టుకోవాలి. అలాగే నిలబడి ఉన్నా, పడిపోయినా గింజలు రంగు మారకుండా, మాగుడు మరియు మానిపండు తెగుళ్లు వ్యాప్తి చెందకుండా ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ తప్పనిసరిగా పిచికారీ చేయాలి. పాలు పోసుకునే దశలో ఉన్న పంటలకు కూడా ఇదే విధంగా నీటిని కాలువల ద్వారా తొలగించి చేలను పైకి లేపడం కీలకం. గింజ గట్టిపడే దశ మరియు కోత దశలో చేలు నీట మునిగితే వెంటనే నీటిని బయటకు పంపాలి. కోత దశలో కంకిలో మొలకలు కనిపిస్తే, నీరు బయటకు తీసిన తర్వాత 5% ఉప్పు ద్రావణం (లీటరు నీటికి 50 గ్రా ఉప్పు) పిచికారీ చేయడం ద్వారా మొలక పడటం, రంగు మారడాన్ని తగ్గించవచ్చు. గింజ గట్టిపడే దశలో కూడా చేలను పైకిలేపి కట్టుకోవడం, నీటిని వేగంగా తొలగించడం తప్పనిసరి. ఇప్పటికే కోసి కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని వర్షం నుండి రక్షించేందుకు బరకాలు కప్పాలి. రెండు మూడు రోజులు ఎండబెట్టే అవకాశం లేకపోతే, కుప్పల్లో మొలక రాకుండా, రంగు మారకుండా ప్రతి క్వింటాకు 1 కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలపడం ద్వారా రక్షణ పొందవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

# చనుపల్లివారిగూడెం ఎస్సీ శ్మశాన వాటికకు ప్రహరీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'మా గ్రామంలో ఉన్న ఎస్సీ శ్మశాన వాటికకు రక్షణ కరవయ్యింది. ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఆక్రమణలు పెరిగిపోయాయి. దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నాము. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం. మా సమస్యకు పరిష్కారం చూపించండి..' అని ఈ నెల 23వ తేదీన కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, మాదలవారిగూడెం గ్రామ శివారు చనుపల్లివారిగూడెం ప్రజలు తమ సమస్యను తెలియజేస్తూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి వినతిపత్రం అందజేశారు. ఆ రోజు కొండపావులూరులోని ఎన్.ఐ.డి.ఎం.లో నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమానికి హాజరై తిరుగు వస్తుండగా మార్గమధ్యంలో చనుపల్లివారిగూడెం గ్రామస్తులు తమ సమస్యను చెప్పుకొన్నారు. వినతి పత్రాన్ని పరిశీలించిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు వెంటనే శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ ని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి గారి చొరవతో ఈ రోజు (31.10.2025)ఎస్సీ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం పనులు తక్షణం ప్రారంభించేందుకు తొలి విడతగా రూ. 10 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అదే రోజు వచ్చిన మరో అర్జీకి పరిష్కారం చూపుతూ ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి మరో రూ. 10 లక్షలు విడుదల చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి ఈ నిధులు మంజూరు చేశారు. ఈ విజ్ఞాపనలపై వేగంగా స్పందించిన కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీని ఉప ముఖ్యమంత్రివర్యులు అభినందించారు.

# రాష్ట్రంలో బెగ్గింగ్ నిషేధం..!



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :ఏపీ ప్రభుత్వం కీలక జీవోను జారీ చేసింది. దీని ప్రకారం.. రాష్ట్రంలో బెగ్గింగ్‌ను నిషేధిత జాబితాలో చేర్చా రు. వాస్తవానికి గత ఏడాది నుంచే దీనిపై కసరత్తు చేసిన సర్కారు.. తాజాగా ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తు న్న విధానాలపై అధ్యయనం చేసింది. అనంతరం.. రాష్ట్రంలో బెగ్గింగ్(అడుక్కోవడమే వృత్తిగా) ను నిషేధిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీవో జారీ చేశారు.

కాగా.. దేశంలో భిక్షాటనపై(బెగ్గింగ్) నిషేధం కొన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. వీటిలో ఈశాన్య రాష్ట్రం మిజోరం, మధ్యప్రదేశ్, యూపీలోని లక్నోలో ఉన్న కొన్ని ప్రాంతాల్లోనూ పరిమితంగా బెగ్గింగ్‌పై నిషేధం ఉంది. తాజాగా ఆంధ్ర ప్రదేశ్ కూడా ఈ జాబితాలో చేరింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చట్టం%-%2025'ని అమల్లోకి తీసుకువచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా భిక్షాటనను నిషేధిస్తూ జీవో విడుదల చేసింది. రీజనేంటి? బెగ్గింగ్‌ను నిషేధించడం వెనుక.. పెట్టుబడులు, అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తున్నాయని.. గతంలోనే సర్కారు వెల్లడించింది. దేశ విదేశాల నుంచి అనేక మంది పెట్టుబడి దారులు వస్తున్న నేపథ్యంలో బెగ్గింగ్ తీవ్ర ఇబ్బందిగా ఉందని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నిషేధించాలా? కొన్ని పెట్టుబడులు తెచ్చే సంస్థలు.. ఏర్పాటు చేసుకునే ప్రాంతాల్లోనే నిషేధం విధించాలా? అనే విషయంపై చర్చించింది. అయితే.. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పెట్టుబడులు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బెగ్గింగ్‌ను నిషేధించారు.

వారి పరిస్థితి ఏంటి? తాజాగా వచ్చిన జీవో ప్రకారం.. ఇపుడు ఆంధ్రాలో భిక్షాటన చేయడం, వారికి డబ్బు ఇవ్వడం, లేదా వారితో లావాదేవీలు నిర్వహించడం నిషేధం. మరి ఇప్పటి వరకు యాయవారం, యాచక వృత్తిపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి ఏంటి? అనేది ప్రశ్న. వీరిని గుర్తించి.. పీ-4కు అనుసంధానం చేయడం ద్వారా వారి జీవితాల్లో గౌరవ ప్రదమైన పరిస్థితిని తీసుకురానున్నారు. అదేవిధంగా కొన్నాళ్ల పాటు ప్రభుత్వమే వారికి పునరావాసం కల్పించనుంది. దీనిని సామాజిక సంక్షేమ శాఖ నిర్వహిస్తుంది.

# ఏపీలో పనిచేస్తున్న 58 మంది తెలంగాణ ఉద్యోగుల బదిలీ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో పనిచేస్తున్న 58 మంది తెలంగాణ ఉద్యోగులను వారి సొంత రాష్ట్రానికి పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ కానున్న వారిలో క్లాస్ 3, క్లాస్ 4 స్థాయి ఉద్యోగులు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం విధించిన కొన్ని షరతులకు అంగీకరిస్తూ ఏపీ సర్కార్ ఈ బదిలీ ప్రక్రియకు ఆమోదం తెలిపింది.

రాష్ట్ర విభజన సమయంలో ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా పలువురు తెలంగాణ ప్రాంత ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. అయితే, వీరిలో 58 మంది ఉద్యోగులు తెలంగాణనే తమ ఆప్షన్‌గా ఎంచుకున్నారు. వీరిలో కొందరు సరైన అవగాహన లేకపోవడం వల్ల, మరికొందరు కారుణ్య నియామకాల కింద తెలంగాణకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కానీ, వివిధ కారణాల వల్ల వీరు ఏపీలోనే ఉండిపోవాల్సి వచ్చింది.

తమను కూడా సొంత రాష్ట్రానికి పంపించాలని వీరంతా చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం, తెలంగాణ సర్కార్‌తో సంప్రదింపులు జరిపింది. తెలంగాణ ప్రభుత్వం విధించిన కొన్ని నిబంధనలు, షరతులకు అంగీకారం తెలిపి, ఈ 58 మంది ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా, గతంలోనూ రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన 698 మంది తెలంగాణ ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సొంత రాష్ట్రానికి పంపిన విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో మిగిలిపోయిన 58 మంది ఉద్యోగులు కూడా త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ సర్వీసులో చేరనున్నారు.

# రాము దాతృత్వం అజరా మరం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :మండల కేంద్రమైన చేబ్రోలు లోని శ్రీ గంగా సమేత నాగేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక భావ-నతో శోభాయ మానంగా భాసిల్లుతోంది. ఈ దేవాలయానికి కార్తీక మాసంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివస్తారు. అయితే ఈ దేవాలయంలో గత నాలుగు సంవత్సరాల నుండి ప్రతి ఏటా అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులకు చేబ్రోలు గ్రామానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ అధిపతి గట్టుపల్లి సుబ్రహ్మణ్యం ప్రతిరోజు మధ్యాహ్నం స్వామి దీక్షపరులకు ఉచితంగా చద్ది ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 24 నుంచి దీక్ష తీసుకున్న భక్తులకు దేవాలయ ప్రాంగణంలో చద్ది ఏర్పాట్లు చేశారు. అయితే ఈసారి బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన తెలుగు యువత అధ్యక్షుడు కొలసం రాము 12 క్వింటాళ్ల 50 కేజీల బియ్యాన్ని అయ్యప్ప స్వాముల చద్ది నిమిత్తం విరాళంగా అందజేశారు. దీంతో ఆయన దాతృత్వ, స్వభావాన్ని పలువురు భక్తులు. కొనియాడుతున్నారు. ఈ చద్ది ప్రసాదానికి వివిధ ప్రాంతాల నుండి నిత్యం భక్తులు స్వామివారి ఆలయం వద్దకు తరలి వస్తున్నారు. వచ్చిన ప్రతి వారికి లేదనకుండా భక్తిశ్రద్ధలతో దీక్షాపరులను.

చక్కగా ఆహ్వానించి భోజన ప్రసాదాన్ని అందజేస్తున్నారు. ప్రసాదానికి అయ్యప్ప , శివ, భవాని ఇతర దీక్షలు తీసుకున్న. దీక్షాపరులు విశేషంగా వస్తున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసం ప్రారంభం నుండి దీక్షలో తీసుకున్న భక్తులకు 41 రోజులపాటు ఉచిత భోజన సతి కల్పిస్తున్నారు. ఇందుకోసం గట్టుపల్లి సుబ్రమణ్యం ప్రతి ఏటా రూ. 10 నుంచి రూ. 12 లక్షల వరకు కొంత డబ్బుని ఖర్చు చేస్తున్నారు. కొంతమంది విరాళాలు కూడా చద్ది వితరణకు అందజేస్తున్నారు, మరికొందరు సరుకులు ఇస్తున్నారు. ప్రతి ఏటా సుబ్రమణ్యం ఏర్పాటు చేస్తున్న ఈ సద్ది భోజన వసతి ఈ ప్రాంతంలో మంచి ఆదరణ పొందింది. అంతేకాకుండా అయ్యప్ప స్వామి నియమాలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ఈ సద్ది ప్రసాదాన్ని తయారు చేయడం ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. ప్రతి ఏటా 41 రోజు పూర్తయిన తర్వాత చివరి రోజున వివిధ స్వాముల దీక్ష తీసుకున్న భక్తులతో పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి భజన, గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు.

# వ్యక్తిగత పర్యటనలో భాగంగా యూకేకు ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డ్ -2025కు ఎంపికైన నారా భువనేశ్వరి ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సులో హెరిటేజ్ ఫుడ్స్ గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకోనున్న భువనేశ్వరి

లండన్ లో 4 తేదీ జరిగే రెండు అవార్డులు కార్యక్రమంలో పాల్గొనున్న చంద్రబాబు దంపతులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : వ్యక్తిగత పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... సతీమణి భువనేశ్వరితో కలిసి శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి లండన్ కు బయల్దేరి వెళ్లనున్నారు. నవంబరు 4 తేదీన ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ లండన్ లో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు అందించనుంది. అలాగే, హెరిటేజ్ ఫుడ్స్ కు ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అదే వేదికపై అందుకోనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు అవుతారు. విశిష్ట వ్యక్తిగా పేర్కొంటూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నారా భువనేశ్వరిని డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు 2025కు ఎంపిక చేసింది. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకంగా పని చేసినందుకు గానూ ఈ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును సంస్థ ఆమెకు అందించనుంది. లండన్ లోని గ్లోబల్ కన్వెన్షన్ లో జరిగే కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నుంచి భువనేశ్వరి ఈ అవార్డును అందుకోనున్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సామాజిక సాధికారితకు పాటుపడుతున్న వ్యక్తిగా ఆమెను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో చైర్మన్ గోపిచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ చైర్ పర్సన్ రాజశ్రీ బిర్లా, సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ, దుబాయ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ అథారిటీ ఎండీ సయీద్ మహ్మద్, హీరో ఎంటర్ ప్రైజెస్, గోయెంకా గ్రూప్ సంస్థల చైర్మన్ సంజీవ్ గోయెంకా వంటి దిగ్గజ వ్యక్తులు గతంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు.

**హెరిటేజ్ ఫుడ్స్ కు గోల్డెన్ పీకాక్ అవార్డు** : ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సులో హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలోనూ భువనేశ్వరి గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకోనున్నారు. ఎఫ్ఎంసీజీ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్ కు జాతీయ స్థాయిలో ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డుకు ఐఓడీ ఎంపిక చేసింది.

**పారిశ్రామిక వేత్తలతో సీఎం భేటీలు** : లండన్ లో వ్యక్తిగత పర్యటన అనంతరం పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరుగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించనున్నారు. దీనికి సంబంధించి లండన్ లోని పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రవాసాంధ్రులతోనూ సీఎం భేటీ కానున్నారు. నవంబరు 6 తేదీన సీఎం తిరిగి రానున్నారు.

# మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇ.డిగా షై జుద్దీన్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా షేక్ షై జుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా డిప్యూటేషన్ పై ఇప్పటి వరకూ పనిచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమితులయ్యారు.

# కాలం కలిసి రాక మారుతున్న రైతన్న తలరాత

- **ముంచుకొచ్చే ప్రమాదం..!**
- **నవంబరుల్లోనే అత్యధికంగా తీవ్ర తుపాన్లు%**
- **ఇప్పటికే పడిపోయిన పొట్ట దశలో ఉన్న వరి**
- **నవంబర్ 4న మరో తుఫాన్**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :

నవంబర్ నెల పేరు చెబితేనే రైతులు గడగడలాడిపోతారు. ఎందుకంటే ఈ నెలకు తుఫానుల నెల అనే పేరు కూడా ఉంది. అంత చేతికి దక్కే టైంలో ఆంధ్రా రైతులను పెను తుఫాను వెంటాడుతూ ఉంటాయి. ప్రతి ఏటా మనం దీన్ని గమనిస్తూనే ఉంటాం. ఈశాన్య రుతుపవనాల కాలంలో ఈ తుఫాను ఎక్కువగా ఏర్పడుతూ ఉంటాయని నిపుణులు చెబుతుంటారు.

తీవ్ర తుపాన్లు ఎక్కువగా వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమైన తర్వాత.. అక్టోబరు, నవంబరుల్లోనే తెలుగు రాష్ట్రాలపై విరుచుకుపడుతున్నాయితాజాగా 'మొంథా' ప్రభావం తీవ్రంగానే ఉండగా.. నవంబర్ 4న బంగాళాఖాతంలో అండమాన్ ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే సూచనలున్నట్లు ఇటీవలవాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఆంధ్ర తీరప్రాంతానికి ఎక్కువగా బంగాళాఖాతంలో ఏర్పడే తుఫాను రైతులను దెబ్బతీస్తూ ఉంటాయి.

వాతావరణ గణాంకాల ప్రకారం.. 1970 నుంచి 2025 మధ్యకాలంలో ఇంతవరకు 31 తీవ్ర తుపాన్లు ఏపీలో తీరాన్ని తాకితే వాటిలో 23 అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఏర్పడ్డాయి. వీటిలో 9 అక్టోబరు, 14 నవంబరు నెలల్లో సంభవించాయి.

**ఈ నెలల్లోనే ఎందుకు?**

జూన్ నుంచి సెప్టెంబరు వరకూ కురిసే భారీవర్షాలతో వచ్చే వరదలు, నదుల నుంచి వచ్చే మంచినీరు బంగాళాఖాతంలోని ఉప్పునీటితో అధికంగా కలవడం వల్ల సముద్ర ఉష్ణోగ్రతల్లో తేడాలు వస్తాయి. హిమాలయాల నుంచి నిరంతరం ప్రవహించే గంగ, బ్రహ్మపుత్ర వంటి నదుల నుంచి పెద్దఎత్తున మంచినీరు బంగాళాఖాతంలో కలుస్తుంటుంది. సాధారణంగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలో సముద్ర ఉష్ణోగ్రతల్లో ఏర్పడే వ్యత్యాసాలతో అల్పపీడనాలు ఏర్పడి వాయుగుండాలు, తుపాన్లుగా మారతాయి. కానీ అక్టోబరు, నవంబరుల్లో ఏర్పడే అల్పపీడనాలు తీవ్ర వాయుగుండాలు, అతి తీవ్ర తుపాన్లుగా రూపాంతరం చెందడం వల్ల పెనుగాలులు వీచి.. కుంభవృష్టి కురిసి నష్టాలు అధికంగా ఉంటున్నాయని వాతావరణ శాస్త్రవేత్త లు విశ్లేషిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలకు.. పసిఫిక్, అట్లాంటిక్ మహా సముద్రాలపై గాలుల్లో ఏర్పడే అస్థిరతతో సంబంధం ఉంది. ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాల మధ్య అట్లాంటిక్ మహాసముద్రంపై గాలుల్లో అస్థిరత అధికంగా ఉన్నప్పుడు ఆ ప్రభావం ఇటు హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంపైనా కనిపిస్తుంది. వర్షాకాలంలో నైరుతి రుతుపవనాల వల్ల దక్షిణ భారతదేశంలో విరివిగా వర్షాలు కురుస్తాయి. సెప్టెంబరు 3వ వారం నుంచి వీటి ఉపసంహరణ ప్రారంభమవుతుంది. అక్టోబరు రెండోవారం నుంచి ఈశాన్య రుతుపవనాలతో అటు తమిళనాడు, ఇటు దక్షిణ కోస్తాంధ్ర, తెలంగాణల్లో వర్షాలు కురుస్తుంటాయి. ఈశాన్య రుతుపవనాల సమయంలోనే తూర్పు గాలుల్లో అస్థిరత అధికంగా ఉంటుంది. ఈ సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాల తీవ్రత పెరిగి తీవ్ర వాయుగుండాలు, అతి తీవ్ర తుపాన్లుగా మారుతున్నాయి. ఆంధ్ర తీరప్రాంతాన్ని తాకే తుఫాన్లు వస్తా జిల్లాల్లో వరి పంటకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయి. ముఖ్యంగా నవంబర్ నెలలో ఉత్తర, దక్షిణ కోస్తాలో ఉన్న శ్రీకాకుళం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం నెల్లూరు జిల్లాలో ఎక్కువగా వరి పంట బాగా పండి రైతుల చేతికి వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ తరుణంలో తరచూ భారీ వర్షాలు కురవడం వల్ల బాగా పండిన వరి పంట నేరపాలు కావటం, ధాన్యం కలిసి మొక్క రావటం, నూర్పిడి చేసిన ధాన్యం కల్లాల్లో తడిచిపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తూ ఉంటాయి. దీనివల్ల ధాన్యం మగ్గిపోవడం నాణ్యత లోపించటం వల్ల కొనుగోలుకు ప్రభుత్వం కానీ, వ్యాపారులు కానీ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించదు, అయితే ఈ ఏడాది వర్షాల వరి రైతులకు ఇబ్బందులు వస్తే ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ప్రస్తుతం అంచనా ప్రకారం రాష్ట్రంలో పండే వారి ధాన్యంలో 51 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే ప్రకటించారు. ఇది కొంత మేరకు రైతులకు భరోసా కల్పించే అంశమే. అయితే వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నవంబర్ నెలలో కూడా తుఫాన్లతో పాటు, భారీ వర్షాలు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రతి ఏటా నవంబర్ నెల లో వర్షాలు కురవటం, వరి పంట దెబ్బ తినడం సర్వసాధారణంగా మారిపోయింది.

# ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,మెరుగైన సేవలు అందించడానికి, దేశంలోని విభిన్న సాంస్కృతిక వైవిధ్యాలను అర్థం చేసుకోవడం ద్వారా సమగ్రతను పెంపొందించుకోవాలని సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేష్ చంద్ర విద్యార్థులను కోరారు. స్వాతంత్ర్య అనంతరం, దేశంలోని 565కు పైగా సంస్థానాలను ఏకీకృతం చేసి ప్రజాస్వామ్య భారత దేశ నిర్మాణానికి సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేశారు. మన దేశ పితామహులు ఊహించిన "ఒక భారత్ %-% శ్రేష్ఠ భారత్ " భావనను అర్థం చేసుకుని అమలు చేసే బాధ్యత ఉన్నదని అన్నారు. జునాగఢ్, జమ్మూ %డ% కాశ్మీర్, హైదరాబాద్ వంటి క్లిష్ట సమస్యలను పరిష్కరించి దేశాన్ని ఏకం చేసిన సర్దార్ పటేల్, అఖిల భారత సర్వీసుల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాల మరియు జిల్లాలలో సమగ్ర పరిపాలనా వ్యవస్థను అందించడంలో ఆయన చేసిన కృషి దేశ సేవకు పునాది వేసిందని తెలిపారు. వైద్యవృత్తిలో ఉన్న నర్సింగ్ విద్యార్థులు, రోగులకు కరుణతో సేవ చేయాలంటే వివిధ ప్రాంతాల సంస్కృతులను అర్థం చేసుకోవాలని రమేష్ చంద్ర సూచించారు.

ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేమూరి వసుంధర మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూలతో కలిసి పోషించిన పాత్రను వివరించారు. ఆయన చూపిన దారిలో నడుచుకుని ఆధునిక భారతదేశాన్ని నిర్మించేందుకు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పోలీస్ అమరవీరులకు ఘన నివాళి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)**: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ శాఖ క్యాండిల్ ర్యాలీ నిర్వహించింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి నగరంపాలెం ఎస్‌బీఐ బ్యాంక్ కూడలి వద్ద ఉన్న పోలీస్ అమరవీరుల స్థూపం వరకు సాగింది.

ర్యాలీ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పుష్పాలను సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించు కోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం అని అన్నారు. ప్రతీ ఏడాది అక్టోబర్ 21 నుండి 31 వరకు జరుగే అమరవీరుల వారోత్సవాలు పోలీస్ శాఖ అంకితభావం, నిబద్ధత, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అమరవీరులు చూపిన ధైర్యం, సేవాస్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శమని, వారి త్యాగం ఎప్పటికీ మరువరాదని తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, పోలీస్ కుటుంబాల సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు మద్దతు ఇవ్వడం, వారి త్యాగాలను స్మరించు కోవడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని హనుమంతు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బెల్లం శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్, అరవింద్, ఎస్‌బి సీఐ అలహరి శ్రీనివాస్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐలు అశోక్, సింగయ్య, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, సురేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# టు టౌన్ సిఐ గా సిహెచ్ ప్రభాకర్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :నరసరావుపేట టూ టౌన్ సిఐగా సిహెచ్ ప్రభాకర్ రావు నియమితులయ్యారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి నరసరావుపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలి అయ్యారు.

# ముప్పవరం నుంచి కాజా వరకు యాక్సెస్ కంట్రోల్ కారిడార్ విస్తరణ

- **14 ప్యాకేజీలుగా విభజన**
- **విస్తరణకు అవసరమైన భూముల సేకరణకు సన్నాహాలు**
- **యాక్సిస్ రోడ్డు అభివృద్ధి చేస్తే పెరగనున్న వాహనాల వేగం**
- **ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో జాతీయ రహదారులను విస్తరించేందుకు కూటమి ప్రభుత్వం విస్తృతంగా సమ్మహాలు చేస్తోంది. రహదారుల విస్తరణకు అవసరమైన భూములను కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇందుకోసం భూసేకరణ కూడా అతి త్వరలో చేపట్టబోతోంది. తాజా సమాచారం మేరకు

సుమారు 100 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు విస్తరణకు అవసరమైన భూములను సర్వే ద్వారా సేకరించబోతోంది. ముప్పవరం నుంచి గుంటూరు జిల్లా కాజా వరకు యాక్సెస్ కంట్రోల్ కారిడార్ ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీన్ని బట్టి బాపట్ల జిల్లా ముప్పవరం నుండి గుంటూరు జిల్లా ఖాజా వరకు ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లా ముప్పవరం నుండి కాజా వరకు సుమారు 100 కిలోమీటర్లు దూరం ఉంటుందని ప్రాథమికంగా నేషనల్ హైవే అథారిటీ అధికారులు అంచనా వేశారు. చెన్నై నుండి కలకత్తా జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా దీనిని నిర్మిస్తారు. ప్రస్తుతం ఇది ఆరు వరుసలుగా ఉన్నప్పటికీ యాక్సెస్ కంట్రోల్ కారిడార్ కాదు. కొత్తగా యాక్సెస్ కంట్రోల్‌గా అభివృద్ధిచేస్తే వాహనాలు మరింత వేగంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డీపీఆర్ తయారీకి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సన్నాహాలు చేస్తోంది. అయితే గత ఏడాది నుంచి ఈ రహదారిపై వాహనాల రాకపోకలు రద్దీగా ఉంది. ఈ రద్దీని తట్టుకునేలా ఈ కారిడార్ నిర్మాణం జరుగుతుంది.

వాహన రద్దీని దృష్టిలో పెట్టుకునే

బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్ కంట్రోల్ కారిడార్ పేరిట.. శ్రీసత్యసాయి జిల్లాలో బెంగళూరు-హైదరాబాద్ హైవే-44లోని కొడికొండ నుంచి బాపట్ల జిల్లాలో చెన్నై-కోల్‌కతా హైవే-16పై ముప్పవరం వరకు కొత్త హైవే నిర్మిస్తున్నారు. 342 కి.మీ. మేర ఈ కారిడార్‌ను 14 ప్యాకేజీలుగా విభజించారు. . నాలుగు వరుసల ఈ కారిడార్ ముప్పవరం వద్ద చెన్నై-కోల్‌కతా హైవేలో కలుస్తుంది. దీనివల్ల ఇప్పటికే చెన్నై-కోల్‌కతా హైవేలో ప్రయాణించే వాహనాలతోపాటు.. అదనంగా కొడికొండ-ముప్పవరం కొత్త హైవే నుంచి వాహనాలు వచ్చి కలుస్తాయి. దీనివల్ల ఎన్‌హెచ్-16పై రద్దీ బాగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు దీనిని దృష్టిలో పెట్టుకొని.. ముప్పవరం నుంచి కాజ సమీపంలోని విజయవాడ పశ్చిమ బైపాస్ మొదలయ్యే ప్రాంతం వరకు 100 కి.మీ. మేర ఇప్పుడున్న హైవేను యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించారు.

మూడు, నాలుగు చోట్లే హైవేపైకి ప్రవేశం

ప్రస్తుతం అనేక గ్రామాల వద్ద చెన్నై-కోల్‌కతా హైవేపైకి వెళ్లేందుకు, హైవే నుంచి గ్రామాల్లోకి మళ్లేందుకు వీలుంటోంది. యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే ఎక్కడికక్కడ హైవేపైకి వాహనాలు వెళ్లేందుకు వీలుండదు. 100 కి.మీ.లో నాలుగైదు చోట్ల మాత్రమే హైవేపైకి ప్రవేశించేందుకు, బయటకు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ 100 కి.మీ. పరిధిలో కొన్నిచోట్లే సర్వీస్ రోడ్లు ఉన్నాయి. యాక్సెస్ కంట్రోల్ కారిడార్‌లో భాగంగా ఇకపై ఇరువైపులా పూర్తిస్థాయిలో రెండేసి వరుసలతో (మొత్తం నాలుగు వరుసలు) సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయడం వల్ల చెన్నై, బెంగళూరు వైపుల నుంచి వచ్చే వాహనాలు వేగంగా రాజధాని అమరావతికి చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుందియాక్సెస్ కంట్రోల్ కారిడార్‌గా ఎన్‌హెచ్-16ను అభివృద్ధి చేసేందుకు వీలుగా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) తయారుచేసేందుకు సలహా సంస్థను ఎంపిక చేసేందుకు నేషనల్ హైవే అథారిటీ ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసం ఎన్‌హెచ్ఏఐ టెండర్లను ఆహ్వానించింది. సలహా సంస్థ ఎంపికయ్యాక అది డీపీఆర్ రూపొందిస్తుంది. ఇది పూర్తి కాగానే ముప్పవరం నుంచి ఖాజా వరకు మరోసారి సర్వే చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.



## రామన్నగూడెంలో పంటలను పరిశీలించిన కలెక్టర్ వెట్రి సెల్వి

**నూజివీడు, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**

నూజివీడు మండలం రామన్నగూడెంలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మినుము పంటను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం పరిశీలించారు. రైతుల నుంచి పంట సాగుకు అయిన పెట్టుబడి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏవో పలగాని చెన్నారావు, ఎంపీడీవో చెన్న రాఘవేంద్ర నాథ్, తహశీల్దార్ గుగులోతు బద్రు తదితరులు పాల్గొన్నారు.

## నాగులపాలెం వద్ద హైవే పరిస్థితులు పరిశీలించిన మంత్రి కొలుసు పార్థసారధి



**బాపట్ల, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**

మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మరియు సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి గౌరవనీయులు శ్రీ కొలుసు పార్థసారధి, చీరాల మండలం నాగులపాలెం గ్రామ సమీపంలోని హైవే రహదారిని పరిశీలించారు. ఈ సందర్శనలో ఆయనతో పాటు పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావంతో రహదారుల దెబ్బతినడం, విద్యుత్ సరఫరా అంతరాయం, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు వంటి అంశాలను మంత్రులు ప్రత్యక్షంగా పరిశీలించారు. మంత్రి కొలుసు పార్థసారధి అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించి, అవసరమైన మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్శనలో స్థానిక ప్రజాప్రతినిధులు, రోడ్డు శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, త్వరిత పరిష్కారం అందిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

## రోడ్డుపై మొక్కలు నాటి నిరసన తెలిపిన వైసీపీ



**మైలవరం, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**

మైలవరం నియోజకవర్గంలోని రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చాలంటూ రోడ్డుపై కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు మాజీ మంత్రి జోగీ రమేష్. జి కొండూరు ప్రధాన కేంద్రంలోని స్థానిక గేల్ కంపెనీ వద్ద నుండి గద్దమడుగు గ్రామ శివారు వరకు ఆయన వైయస్ఆర్సీపీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. నియోజకవర్గంలో ఉన్న గోతులు ఎమ్మెల్యే వసంతకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లతో పావలా వాటా కుదుర్చుకోవడమే గాని అభివృద్ధిపై దృష్టి లేదని ఆయన పేరు వసంత కృష్ణ ప్రసాద్ కాదు పావలా కృష్ణ ప్రసాద్ అంటూ ఎద్దేవా చేశారు. రెండుసార్లుగా మిమ్మల్ని మైలవరం ప్రాంత ప్రజలు గెలిపిస్తే మైలవరానికి మీరు చేసింది ఏమిటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వెంటనే గుంతలు పూర్చుక పోతే భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జి. కొండూరు జెడ్పిటిసి మందా జక్రధరరావు ( జక్రి) . జి. కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, , జి .కొండూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు జడ రాంబాబు . ఎంపిటిసిలు. సర్పంచులు. యువకులు. మహిళలు. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ వైపు చూపు మళ్లించిన ముస్లిం యువత

**శ్రీకాళహస్తి, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**



గతంలో విద్యకు దూరంగా, నిరుద్యోగ జీవితం గడిపే ముస్లిం యువత ఇప్పుడు సాంకేతిక రంగం వైపు చూపు మళ్లించారు. మన కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా ఆసియా ఖండంలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం, యువతలో కొత్త ఆశలు నింపింది. ఈ మార్పుతో స్ఫూర్తి పొంది, ముస్లిం యువత సాఫ్ట్‌వేర్ మరియు వెబ్‌సైట్ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన ముస్లిం యువత రూపొందించిన ఒక యాప్‌ను ఈరోజు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆవిష్కరించారు. యువత సృజనాత్మకతను అభినందించిన ఎమ్మెల్యే, "మన యువత సమయాన్ని వృథా చేయకుండా కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి. ఎవరికి సహాయం అవసరమైనా నేను ముందుంటాను" అని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రోత్సాహంతో యువత సాంకేతిక రంగంలో ముందుకు రావడం ప్రాంతానికి గర్వకారణమని పలువురు స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముస్లిం యువతలో చోటు చేసుకుంటున్న ఈ సానుకూల మార్పు, విద్యా అభివృద్ధి మరియు డిజిటల్ శక్తివంతత వైపు సమాజం అడుగులు వేస్తోందని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# మున్నేరు, కృష్ణా ప్రవాహాలపై నిరంతర అప్రమత్తత

- ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందుతుంది
- రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**పెనుగంచిప్రోలు, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**

తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద పోటెత్తుతోందని.. ఈ నేపథ్యంలో మున్నేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు.. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మున్నేరు వరద ఉద్ధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో మున్నేరు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మున్నేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని.. మున్నేరుకు అటూఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెనువెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళిక లతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్.. ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ రహదారులకు సంబంధించి కూడా ప్రణాళికలు ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

**రైతులకు ప్రభుత్వం పూర్తి భరోసా**

రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపో యిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపా రు. అన్నదాతల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పరిస్థితి ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీకి కూడా వరద నీరు పోటెత్తుందోని.. ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువున, దిగువున ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీచేశామన్నారు.

# మునేరు వరద నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు చర్యలు తీసుకున్నాం

- ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి & రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, తంగిరాల సౌమ్యలతో కలిసి మునేరు పరిశీలన
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- ప్రజలకు ఇబ్బందిలేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడి



**కంచికచర్ల, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**

మునేరుకు వరద ఉధృతి పెరుగుతున్నందున ఆస్తి ప్రాణ, నష్టాలు సంభవించకుండా అన్ని చర్యలు చేపట్టామని ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు & రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం సాయంత్రం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ లతో కలసి కీసర బ్రిడ్జి వద్ద మునేరు ప్రవాహాన్ని పరిశీలించారు. వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున పరిసర గ్రామాలు.. ముఖ్యంగా కీసర, పెండ్యాల, ఎస్. అమరవరం, వేములపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వరద కారణంగా ఆస్తి, ప్రాణనష్టాలు సంభవించకుండా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్ని చర్యలు చేపట్టారని, యంత్రాంగమంతా సన్నద్ధంగా ఉందని చెప్పారు. మొంథా తుపానును సమష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని.. తెలంగాణలో కురిసిన వర్షాల వల్ల దిగువకు వరదనీరు పోటెత్తుతోందని.. ముందస్తు జాగ్రత్తలతో ప్రజలకు ఇబ్బందిలేకుండా చూస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల తహశీల్దార్ నరసింహారావు, డి.ఎస్.పి తిలక్, మండల వ్యవసాయ అధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు

- మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టం అంచనా వేయండి
- అధికారులతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సమీక్ష

**మైలవరం, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**



రైతులెవరూ అధైర్య పడవద్దని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేప ట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేయా లని ఆయన అధికారులను ఆదేశించారు. మైలవరం నియోజకవర్గంలో తుఫాను కారణంగా సంభవించిన వరదల వల్ల జరిగిన నష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువా రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా వరిపైరు చేతికి వచ్చే దశలో ఈ విధంగా నీటమునగటం చాలా బాధాకరం అన్నారు. అలాగే పత్తి కూడా వరుసగా వర్షాల నేపథ్యంలో రైతులకు చేతికి అందకుండా పోతోందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, వాణిజ్య పంటలు చాలా చోట్ల దెబ్బతిన్నాయన్నారు. దీనిపై ఖచ్చితంగా ఎన్యుమరేట్ చేసి నష్టం జాబితాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. సీఎం చంద్రబాబు తుఫా ను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చారని అన్నారు. కౌలు రైతులకు కూడా వారికే నష్టపరి హారం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. అలానే వరి, పత్తి పైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పంట నష్టం తీవ్రత తగ్గించాలని ఆదేశించారు.

## కృష్ణా నది వరద ముంపు ప్రమాదంపై

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- దక్షిణ కోస్తా తుఫాన్ ప్రత్యేక అధికారి ఆర్.పి. సిసోడియా

**బాపట్ల, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్)**



కృష్ణా నది నుండి భారీగా నీరు విడుదల అవుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యదర్శి మరియు దక్షిణ కోస్తా తుఫాన్ ప్రత్యేక అధికారి ఆర్.పి. సిసోడియా అధికారులను ఆదేశించారు. గురువారం బాపట్ల కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో ఆయన రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కృష్ణా నది వరద ప్రభావం వల్ల ముంపుకు గురయ్యే రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాలు మరియు నల్లమడ కాలువ క్రింద ఉన్న గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఈ సమావేశంలో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆర్.పి. సిసోడియా మాట్లాడుతూ, "జిల్లాలో కృష్ణా నది ముంపు ప్రమాదానికి గురయ్యే ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలి" అని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్ మాట్లాడుతూ, వరద ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన చర్యలు చేపట్టామని తెలిపారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు కృష్ణా నది ఏ ఏ మండలాల గుండా ప్రవహిస్తుందో అనే వివరాలను ప్రత్యేక అధికారికి వివరించామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ఇరిగేషన్ శాఖ ఎస్.ఇ. అబూత్ అలీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనీలకు ఉద్యోగావకాశాలు

### 3 నుంచి నైపుణ్య శిక్షణ: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, వారధి ట్రస్ట్ సౌజన్యంతో ఉద్యోగావకాశాలతో కూడిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నవంబరు 3 నుంచి నిర్వహించనున్నట్లు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, ఎన్ఎసి వైస్‌చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సివిల్ సూపర్‌వైజర్, ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయనీ, శిక్షణతోపాటు ఉచిత భోజనం, నివాసం, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్‌తోపాటు ఉద్యోగావకాశాలు అందించ బడుతాయని మంత్రి తెలిపారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన నంబర్లు: 8008937800 / 9032504507 ఫోన్ చేయాలని మంత్రి పేర్కొన్నారు.

## 8 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

### తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) అధ్వర్యంలో నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలను నవంబరు 8 నుంచి నిర్వహించనున్నారు. నవంబరు 16 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్టు కమిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. నవంబరు 2025 సెషన్, నోట్ నం. 04/2025 ప్రకారం కమిషన్ నిర్ణయించిన విధంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలతో సహా హెచ్ఎండిఏ పరిధిలో డిపార్ట్‌మెంటల్ టెస్ట్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ నం. 04/2025ను గతంలోనే జారీ చేసిన విషయం తెలిసిందే. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నవంబరు 1 సాయంత్రం 5 గంటల నుండి కమిషన్ అధికారిక వెబ్‌సైట్ నుండి తమ హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. భవిష్యత్తు అవసరాల కోసం హాల్ టికెట్లను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని అభ్యర్థులకు కమిషన్ సూచించింది. హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే, అభ్యర్థులు 040-22445566 ద్వారా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని కమిషన్ పేర్కొంది.

## ఎస్‌ఎస్‌సి పరీక్ష ఫీజు స్వీకరణ ప్రారంభం

### నవంబరు 13 తుది గడువు

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో చేరిన విద్యార్థులకి సంబంధించి వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు గురువారం నుంచి ప్రారంభించారు. నవంబరు 13 వరకు అపరాధ రుసుం లేకుండా ఫీజును స్వీకరించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ పివి శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ. 50తో నవంబరు 15 నుంచి 29 వరకు, రూ. 200తో డిసెంబరు 2 నుంచి 11 వరకు, అపరాధ రుసుం రూ. 500తో డిసెంబరు 15 నుంచి 19 వరకు స్వీకరించనున్నట్టు ప్రకటించారు.

విద్యా ర్థుల డేటాను నవంబరు 18 లోపు పాఠశాల ప్రధానోపాధ్యా యులు (హెచ్‌ఎం), జిల్లా విద్యాధికారి(డీఈవో) లకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు రూ. 125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు రూ. 110, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ అయితే 125 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష ఫీజుకు అదనంగా రూ. 60 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## నేటి నుంచి ఎం ఫార్మసీ, ఫార్మా-డి ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

### 4 వరకు దరఖాస్తులకు అవకాశం

### 6 నుంచి 8 వరకు వెబ్‌ఆప్షన్లు

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మసీ కాలేజీల్లో ఎం ఫార్మసీ, ఫార్మా డి(పిబి) కోర్సుల్లో అడ్మిషన్ల కోసం పిజి ఈ సెట్-2025 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను నవంబరు 1 నుంచి ప్రారంభించనున్నారు. నవంబరు 1 నుంచి 4 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5న అర్హత కలిగిన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నవంబరు 6 నుంచి 8 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. వెబ్ ఆప్షన్లకు నవంబరు 8న ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి నవంబరు 12న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన వారు నవంబురు 13 నుంచి 15లోగా ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ పాండురంగారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

# బియ్యం ఎగుమతితో రైతు ఆదాయం పెంపునకు కృషి




### పౌర సరఫరాల కమిషనర్ ముత్యాల స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ధాన్యంలో పోషకవిలువలు నాణ్యతా ప్రమాణాలు ప్రపంచానికి తెలియడంతో బియ్యం ఎగుమతి సామర్థ్యం పెరిగిందని ఇంకా తెలంగాణలో సాగు చేస్తున్న వరిధాన్యం రకాలను ప్రపంచానికి పరిచయడం చేయడంతో పాటు రైతు ఆదాయం పెంచడానికి పూనుకొన్నామని తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముత్యాల స్టీఫెన్ రవీంద్ర చెప్పారు. గురువారం న్యూఢిల్లీ లోని భారత్ మండపం హాల్ నెం.14లో నిర్వహించిన భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఆయన వివరించారు తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంతో కలిసి ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. తెలంగాణ బియ్యం ఎగుమతి సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నామని అన్నారు. ఈ సమావేశానికి వచ్చిన వివిధ దేశాల ప్రతినిధుల దృష్టిని తెలంగాణ స్టాల్ ఆకర్షించింది. కువైట్, ఆఫ్రికా దేశాల ప్రతినిధి ఎన్‌సీఈఎల్ ఎండీ ఉనుపోమ్ కౌసిక్, ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రేమ్ గార్గ్, దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు తెలంగాణ స్టాల్‌ను సందర్శించారనీ స్టీఫెన్ చెప్పారు. ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 118 జైశ్రీరామ్, హెచ్ ఎంటీ సోనా, చిట్టిముత్యాలు వంటి ప్రీమియం రకాల బియ్యాన్ని తెలంగాణ స్టాల్‌లో ప్రదర్శించామని రవీంద్ర తెలిపారు. తెలంగాణలో పండించే బియ్యాన్ని ఇప్పటికే పిలిప్పిన్స్‌కు ఎగుమతి చేస్తున్నామని అలాగే మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసేలా ప్రయత్నాలు చేస్తున్నామనీ చెప్పారు. బియ్యం ఎగుమతి పెరిగితే తెలంగాణ రైతులకు చాలా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్, సెక్రెటరీ కోఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్‌సింగ్, ఇతర పౌర సరఫరాల శాఖ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

# అజారుద్దీన్ మంత్రి కాకుండా అడ్డుకొంటున్న బిజెపి, బిఆర్ఎస్

### బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు ప్రజలు అడ్డుకోవాలి

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం జరగకుండా బిజెపి,బిఆర్ఎస్ రెండు పార్టీలు అడ్డుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు.గురువారం సిఎల్‌పిలో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు మొదలుపెట్టారని వాటిని అడ్డుకోవాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. గతంలో రాజస్థాన్ లో ఉప ఎన్నిక అభ్యర్థిని పోలింగ్ కు 20 రోజుల ముందు బిజెపి మంత్రివర్గంలోకి తీసుకుందని ఆయన చరిత్రను గుర్తుచేశారు. మైనార్టీ కి మంత్రి వర్గంలోకి తీసుకోవడం బిజెపికి ఇష్టం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ దీన్ని ప్రశ్నించకుండా బిజెపి సహకరిస్తోందని ఆరోపించారు.

బిఆర్ఎస్, బిజెపి లోపాయికారీ ఒప్పందాన్ని గతంలోనే కవిత బయటపెట్టిందని అద్దంకిదయాకర్ అన్నారు పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి 8 సీట్లు రావడానికి బిఆర్ఎస్ సహకరించిందనీ ఆయన ఆరోపించారు. రాజకీయ రహస్య ఒప్పందంలో భాగంగానే అజారుద్దీన్ ప్రమాణస్వీకారాన్ని ఈ రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయనీ ఆవేదన చెందారు. బిజెపి ద్వంద్వ నీతి అవలభిస్తోందనీ,బిసి బిడ్డకు జూబ్లీహిల్స్ లో టికెట్ ఇస్తే రౌడీ షీటర్ ని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మైనార్టీలు అంటే బిజెపికి, బిఆర్ఎస్ పార్టీలకు నచ్చవనీ జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ కి రాజ్యాంగ పరమైన హక్కులను కాలరాసే ప్రయత్నం బిజెపి చేస్తోందని అన్నారు.

# బిసి జాతి పోరాటంలో తలవంచను

### ఎంపి, బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య

### 80 బిసి కుల సంఘాలు, 35 బిసి సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, విద్యార్థి, ఉపాధ్యాయ, విశ్వవిద్యాలయాలు, యువజన సంఘాల సమావేశం-

### బిసి జాక్ కన్వీనర్ల నియామకం



సభలో ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య, రాంమూర్తిగౌడ్, గుజ్జసత్యం, రామకోటి, నీల వెంకటేష్, అనంతయ్య, రామలింగం, అనురాధ, లక్ష్మి, పద్మ, సౌజన్య తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** బిసిల న్యాయమైన డిమాండ్లు, అభ్యున్నతి, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఎన్ని సమస్యలొచ్చినా పార్టీలను, ప్రభుత్వాలను, అంతర్గతకుట్రలు, వ్యతిరేకులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, బిసి జాతికోసం పోరాటంలో ఎప్పుడూ ఎక్కడా తలవంచను, తలదించనని ఎన్ని త్యాగాలకైనా సిద్ధమేనని రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య ఉద్వేగభరితంగా శపథం చేస్తూ, చట్టసభలో బిసిలకు రిజర్వేషన్లు సాధించిన బిసిలు రాజ్యాధి కారం సాధించిన తర్వాతనే నాజీవి పోతుందని స్పష్టం చేశారు. పార్లమెంటులో బిసి బిల్లు పెట్టేవరకు ఎవ్వరినీ వదిలి పెట్టనని సభాముఖంగా వాగ్దానం చేశారు. ఇందుకు అన్ని కులసంఘాలు, బిసి సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, ఉపాధ్యాయ, అన్నిరంగాల సంఘాలు కలసికట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు లకిడీకాపూల్‌లోని ఒక హోటల్‌లోని సమావేశ వేదిక గురువారం మధ్యాహ్నం రాంమూర్తిగౌడ్, గుజ్జ సత్యం, అల్లంపల్లి రామకోటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిసి జాక్ ఆధ్వర్యంలో 80 బిసి కులసంఘాలు, 35 బిసి సంఘాలు, ఇతరత్రా అన్నిరంగాల బిసి సంఘాల సమావేశంలో ఆర్. కృష్ణ య్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యమ భవిష్యత్ కార్యక్రమాలకు నిర్ణయం తీసుకుంటూ ప్రసంగిం చారు. ఇటీవల బిసి జెఏసి పిలుపుమేరకు దిగ్విజయంగా జరిగిన రాష్ట్రవ్యాప్త బంద్‌తో రాజ్యాంగ వ్యవస్థలకే దిమ్మదిరిగిపోయి బిసిల సత్తా ఏమిటో అర్థమైందన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభు త్వానికి రాజ్యాంగం ఇచ్చింది కనుకనే ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేశారన్నారు. ఈ జిఒ రాజ్యాంగ, న్యాయపరంగా బలంగా ఉందని, కేసు హైకోర్టు, సుప్రీం కోర్టులో గెలుస్తుందని స్పష్టం చేశారు. పోటీతత్వం ప్రతీ బిసిల్లో రావాలని అన్నిస్థాయిల్లో బిసి జాక్ కన్వీనర్లను నియమిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 25 మందిని ఆయా సంఘాల తరఫున జాక్ రాష్ట్ర కన్వీనర్లుగా ఎంపిక చేసినట్లు ఆర్.కృష్ణయ్య వారిపేర్లను వెల్లడించారు. వచ్చే సమా వేశంలో మిగతా కులసంఘాల కన్వీనర్లను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు నీల వెంకటేష్, బి.కృష్ణ, అనంతయ్య, రాజేందర్, రాందేవ్, మనికంఠ, రాజునేత, సతీష్, రామలింగం, అనురాధగౌడ్, పద్మ, లక్ష్మి, సౌజన్య, శివయాదవ్ తదితర నాయ కులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీస్ ఇచ్చిన 'భోజనం' ఏజెన్సీలతో మాట్లాడండి

### డిఇఒలకు పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు నేడు (అక్టోబరు31)న జిల్లా సమ్మెను, అలాగే నవంబరు 12న స్టేట్ స్ట్రయిక్ చేస్తా మని నోటీసు ఇవ్వడంతో పాఠశాల విద్య డైరక్టర్ స్పందించారు. నోటీసులు ఇచ్చిన ఏజెన్సీలతో వెంటనే సంప్రదింపులు జరిపి సమ్మె జరగకుండా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారుల (డీఈవో)ను ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేటితోపాటు, నవంబరు 12న కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న ఏజెన్సీలు సమ్మెలోకి వెళ్లకుండా నివారించేలా వారితో చర్చలు జరపాలని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ డీఈవోలకు సూచించారు. సమ్మె నోటీసు ఇచ్చిన ఏజెన్సీలు స్ట్రయిక్ కొనసాగిస్తే ఇతర మార్గాల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# డిఎంఇ, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్లను సస్పెండ్ చేయాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**హైదరాబాద్ అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి,చర్యలు తీసుకోవాలని, డీఎంఈ, నర్సింగ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠి లోని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించి, అనంతరం డైరెక్టర్ నరేంద్ర కుమార్ పేషీలో ఏఐవైఎఫ్ రాష్ట్ర బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ. కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై విచారణ జరపాలి. గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో ప్రకారం సంబంధిత చిరునామాల్లో నర్సింగ్ స్కూల్స్ మరియు కళాశాలలు నిర్వహించకుండా ఇతర ప్రాంతాల్లో, జిల్లాల్లో నిర్వహిస్తున్నారని, అలాగే ఒకే భవనంలో 2 నుండి 6 ఇన్‌స్టిట్యూషన్స్ నిర్వహించడం, భవనాలు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, విద్యార్థులు క్లినికల్ సైడ్ ప్రాక్టీస్ చేస్తున్నారా లేదా అనే విషయాల పట్ల బాధ్యతా రహితంగా వ్యవహరిస్తు న్నారని వారు ధ్వజమెత్తారు. విధుల పట్ల నిరక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల భవిష్యత్తును, ప్రభుత్వ వ్యవస్థని భ్రష్టు పట్టించిన ఈ అధికారుల పైన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో నర్సింగ్ ఎడ్యు కేషన్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దాసు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్‌ల పైన ఏసీబీ ద్వారా విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రం లోని నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి,చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



కోఠిలోని వైద్య విద్య సంచాలకుల కార్యాలయం ముందు నిరసన



# హారీశ్‌రావు ఇంటికి వెళ్లి పరామర్శించిన కవిత

**జర్నలిస్ట్‌ఫైల్ ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 31 :** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీమంత్రి హారీశ్‌రావును పరామర్శించారు. హారీశ్‌రావు తండ్రి సత్య నారాయణరావు మూడు రోజుల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. గురు వారం హారీశ్ ఇంటికి వెళ్లిన కవిత, ఆయన కుటుంబసభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేసి, కాసేపు కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కాగా, ఈ పరామర్శకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. సత్యనారాయణరావు అంత్యక్రియలకు కవిత హాజరుకాలేదు. దీంతో హారీశ్‌తో ఆమెకు ఉన్న విభేదాల కారణంగానే రాలేదంటూ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో, మూడురోజుల తర్వాత కవిత స్వయంగా హారీశ్ ఇంటికి వెళ్లి పరా మర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో కవిత.. హారీశ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై హారీశ్ నేరుగా స్పందించకపోయినా, తన ప్రస్థానం తెరిచిన పుస్తకం అంటూ పరోక్షంగా సమాధానమిచ్చారు. ఆ వివాదం తర్వాత హారీశ్ ఇంటికి కవిత వెళ్లడం ఇదే మొదటిసారి.



కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు పలుకుతున్న మాల మహానాడు నాయకులు

# ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మాల మహానాడు మద్దతు : జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్):** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీతో విభేదించి, పోరాటం చేస్తున్నప్పటికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం దిశగా బిసి అభ్యర్థి నవీన్ యాదవ్‌ని ఎన్నికల్లో నిలబెట్టినందుకు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని మాల మహానాడు జాతీయ కమిటీ ప్రకటించింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ఉండగా ప్రధాన రాజకీయ పార్టీలలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే సామాజిన న్యాయం దిశగా బలహీన వర్గాల అభ్యర్థిని నిలిపినందున నవీన్‌యాదవ్ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో మాలలకు సరైన ప్రాతినిధ్యం కల్పించడం తోపాటు సామాజిక న్యాయం దిశగా రాజ్యాంగాన్ని కాపాడటానికి ఎంతో కృషి చేస్తున్నదని చెప్పారు.

ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అగ్రవర్ణాల అభ్యర్థులకు అవకాశం కల్పించాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికే మాల మహానాడు కార్యకర్తలు నవీన్‌యాదవ్ విజయం కోసం విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టారని, ప్రజల నుంచి మంది స్పందన వస్తున్నదన్నారు. ఎన్నికల్లో మతోన్మాదులు బలపడకుండా చూడాల్సిన బాధ్యత లౌకిక వాదులపై ఉందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రధాన రాజకీయ పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అగ్రవర్ణాల అభ్యర్థిని నిలబెట్టి బిసిలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు మందా రంజిత్ కుమార్, బైండ్ల శ్రీనివాసులు, ఎం.సరళ, లలిత తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ చిత్తు కావడం సత్యం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్ అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి కుర్చీలో రేవంత్ రెడ్డి కూర్చోవడం జీర్ణించుకోలేక కెటిఆర్ తెగ గింజుకుంటున్నాడని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శించారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వం పడిపోతుందని కెటిఆర్ గోతి నక్కలా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెటిఆర్ మాటలతో ఆయనలోని కుట్ర, కుతంత్రం అంతా బయ ట పడిందని ఆరోపించారు. పదవి కోసం ఎంత నీచానికైనా దిగజారు తామని ఆయన బహిరంగంగానే చెప్పుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ప్రభుత్వం కూలిపోతుందని నీచపు మాటలు మాట్లాడావు, నీ అయ్య, నీ కుట్రలు తెలిసే 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మా ప్రభుత్వానికి మద్దతు తెలిపారని ఆయన చెప్పారు. జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో ఉండదని జోస్యం చెప్పారు.




సమావేశంలో అభివాదం చేస్తున్న వెన్నెల గద్దర్, రామిరెడ్డి, ప్రఫుల్‌కుమార్ తదితరులు

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలి

### తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్మన్ వెన్నెల

**హైదరాబాద్, అక్టోబరు 31(జర్నలిస్ట్ ఫైల్):** పదేళ్ల నిరంకుశ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడంలో తెలంగాణ ఉద్యమ కారుల పాత్ర చాలా గొప్పదని, అదే సంకల్పంతో మరో మారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దత్తు ఇస్తున్న ప్రతీ తెలంగాణ ఉద్యమ కారునికి ఉద్యమాభివందనాలు తెలుపుతున్నట్లు తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్, గద్దర్ కుమార్తె వెన్నెల తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఉద్యమకారులు ఎటువైపు అన్న అంశంపై చర్చా వేదిక లో జేఏసీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రఫుల్ కుమార్ లతో కలిసి ఆమె మాట్లాడారు. కళాకారులకు, ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, వారి డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క త్వరలోనే తీరుస్తారని చెప్పిన మాటను గుర్తు చేశారు. న్యాయం జరగాలని, ఒక బీసీ బిడ్డకు టికెట్ ఇస్తే గెలిపించుకునే బాధ్యతను ఉద్యమకారుల జేఏసీ తీసుకున్నందుకు హార్షం వ్యక్తం చేశారు.

# ఓపెన్ స్కూల్ టెన్త్‌లో 48 శాతం.. ఇంటర్‌లో 58 శాతం ఉత్తీర్ణత

### వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్‌కి మెమోలు

**హైదరాబాద్, అక్టోబరు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) అధ్వర్యంలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. టెన్త్‌లో 48.86 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్‌లో 58.21 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) డైరక్టర్ పివి శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన మార్కుల మెమోలు నేటి(శుక్రవారం) నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్‌లో తమ ఫలితాలను చూసుకోవచ్చని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఎస్ఎస్‌సీ పరీక్షకు 9,717 మంది హాజరు కాగా వారిలో 4,748 మంది (48.86 శాతం) ఉత్తీర్ణుల య్యారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో 2,900 మంది బాలురు ఉండగా.. 1,848 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 11,520 మంది హాజరు కాగా 6,706 మంది (58.21 శాతం) ఉత్తీర్ణుల య్యారు. అందులో బాలురు 4,419 మంది, బాలికలు 2,287 మంది ఉన్నా రు. పరీక్షకు సంబంధించి మార్కుల జాబితా మరో 25 రోజుల్లో ఆయా విద్యా సంస్థలకు అందజేస్తామని, అక్టోబర్ 31 సాయంత్రం నుంచి వెబ్ ద్వారా మార్కుల మెమోరాండం డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉంటుందన్నారు. మార్కుల మెమోలో ఏమైనా తప్పిదాలు ఉంటే నవంబర్ 14లోపు సంబంధిత డీఈవో, ప్రిన్సిపల్ ద్వారా టాస్ రాష్ట్ర కార్యాలయానికి తెలియజేయాలన్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు నవంబర్ 4 నుంచి 12 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఇంటర్ రీకౌంటింగ్‌కు రూ.400, ఎస్ఎస్‌సీకి రూ.350 ప్రతి సబ్జెక్టుకి రుసుము చెల్లించాల్సి ఉంటుందని, రీవెరిఫికేషన్‌కి రూ. 1200 చెల్లించాలని ఆ ప్రకటనలో వెల్లడించారు.

# అణు జలాంతర్గామి డ్రోన్ పరీక్ష విజయవంతం

## - రష్యా అధ్యక్షుడు పుతిన్



**మాస్కో, అక్టోబరు 31 :** అణ్వాయుధ సామర్థ్యం కలిగిన పోసిడాన్ మానవరహిత అండర్‌వాటర్ వెహికిల్ (అణుజలాంతర్గామి డ్రోన్)ను విజయవంతంగా పరీక్షించినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. ఆ వెహికల్‌ను జలాంతర్గామి నుంచి బూస్టర్ ఇంజిన్ సాయంతో విజయవంతంగా పరీక్షించినట్లు చెప్పారు. మంగళవారం అణ్వాయుధ టార్పిడో పరీక్ష జరిగినట్లు పుతిన్ పేర్కొన్నారు. పోసిడాన్‌ను అణ్వాయుధ సామర్థ్యం కలిగిన టార్పిడోగా చెబుతున్నారు. అయితే సముద్ర గర్భంలో ఆ టార్పిడో ఆటోమెటిక్‌గా న్యూక్లియర్ ప్రొపల్సన్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేస్తుందని పుతిన్ తెలిపారు. మాస్కోలో మిలిటరీ ఆస్పత్రి సందర్శించిన పుతిన్, అక్కడ మీడియాతో మాట్లాడుతూ... ఇలాంటి ఆయుధం మరొకటి లేదన్నారు. పోసిడాన్‌ను అడ్డగించే విధానం ఏదీ లేదన్నారు. తమ వద్ద ఉన్న ఖండాంతర క్షిపణి సర్మత్ కన్నా బెటర్‌గా పోసిడాన్ తన సామర్థ్యాన్ని చాటినట్లు పుతిన్ వెల్లడించారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన బురెవిస్నిక్ క్షిపణిని కూడా ఇటీవల రష్యా పరీక్షించిన విషయం

# అమెరికాలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు

## అధ్యక్షుడు ట్రంప్ ఆదేశం



**వాషింగ్టన్, అక్టోబరు 31 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. అణ్వాయుద్ధ పరీక్షలు తిరిగి ప్రారంభించాలని తాను డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. రష్యా, చైనాలు తమ అణ్వాయుధ కార్యక్రమాలను విస్తరిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'ప్రపంచంలోని ఇతర దేశాల కంటే యుఎస్ ఎక్కువ అణ్వాయుధాలు కలిగి ఉంది. నా మొదటి పదవీ కాలంలోనే దీన్ని సాధించాం. దీనికి విపరీతమైన విధ్వంసకర శక్తి ఉన్నందున నేను ఇది చేయడానికి ఇష్టపడలేదు. కానీ.. ఇప్పుడు వేరే మార్గం లేదు. అణ్వాయుధ కార్యక్రమాల్లో రష్యా రెండో స్థానంలో ఉంది. చైనా మూడో స్థానంలో ఉంది. ఐదేళ్లలోపు అవి సమానంగా ఉంటాయి. ఇతర దేశాలు దీని కార్యక్రమాలు విస్తరిస్తున్నందున.. మన అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించాలని నేను యుద్ధ శాఖను ఆదేశించాను. ఈ ప్రక్రియ వెంటనే ప్రారంభమవుతుంది' అని ట్రంప్ రాసుకొచ్చారు. రష్యా తన ఆయుధ ఉత్పత్తిని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల కీలక ఆయుధ నియంత్రణ ఒప్పందాల నుంచి వైదొలగి.. అధునాతన అణు సామర్థ్యాలను విస్తరిస్తోంది. అణుశక్తి ఆధారిత సబ్‌మెర్సిబుల్ డ్రోన్ 'పోసిడాన్'ను విజయవంతంగా పరీక్షించిన సంగతి తెలిసిందే. ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో బీజింగ్ కూడా ఈన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది. మరో ఐదేళ్లలోపు చైనా అణు సామర్థ్యాలు.. అమెరికా, రష్యాకు సమాన స్థాయికి చేరుకోగవని యుఎస్ నిఘా వర్గాలు ఇటీవల హెచ్చరించాయి. మరోవైపు.. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీకి కొన్ని గంటల ముందు ట్రంప్ అణుపరీక్షల గురించి ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆదేశాల గురించి పెంటగాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# స్నేహితురాలి ఇంట్లో మహిళా డిఎస్పీ చోరీ!




**భోపాల్, అక్టోబరు 31 :** మధ్యప్రదేశ్‌లో ఓ మహిళా పోలీసు ఆఫీసర్ దొంగతనానికి పాల్పడింది. ఈ ఘటన బోపాల్‌లోని జహంగిరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. తన స్నేహితురాలి ఇంట్లోనే ఆమె నగదు ఎత్తుకెల్లింది. ఈ ఘటన మధ్యప్రదేశ్ పోలీసు శాఖలో తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో కల్పనా రఘువంషీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే స్నేహితురాలి ఇంటికి వెళ్లి అక్కడ నుంచి రెండు లక్షల నగదు, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లిందామె. ఈ ఘటనలో ఆ మహిళా డీఎస్పీపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ కల్పనపై ఆమె స్నేహితురాలు ఫిర్యాదు చేసింది. మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి స్నానానికి వెళ్లిన సమయంలో దొంగతనం జరిగినట్లు ఆమె చెప్పింది. స్నానం చేసేందుకు బాత్రూంకు వెళ్లిన సమయంలో డీఎస్పీ కల్పన వచ్చిన క్యాష్, సెల్‌ఫోన్ తీసుకెళ్లిందన్నారు. నగదు, ఫోన్ మిస్ కావడంతో సీసీటీవీ పరిశీలిస్తే ఆ సమయంలో డీఎస్పీ కల్పన వచ్చి వెళ్లినట్లు కనిపించింది. చేతుల్లో కరెన్సీ కట్టలు ఉన్న దృశ్యాలు కనిపించాయి. దీంతో షాకైన ఆ మహిళ పోలీసు స్టేషన్‌కు వెళ్లి డీఎస్పీ కల్పనపై ఫిర్యాదు చేసింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా రఘువంశీపై చోరీ కేసు పెట్టారు.

# కుమార్తెమరణించిన బాధలో ఉన్నా లంచాలు ఇవ్వాల్సి వచ్చింది

## ఓ మాజీ సిఎఫ్ఓ ఆవేదన!

**బెంగళూరు, అక్టోబరు 31 :** లంచాలు ఇచ్చి తాను ఎంతగానో విసిగిపోయానని, కుమార్తె మరణించిన బాధలో ఉన్నా ఎవరూ కనికరం చూపలేదని బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి నెట్టింట్లో షేర్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో సిఎఫ్ఒ విధులు నిర్వర్తించినట్లు తన పోస్ట్‌లో పేర్కొన్న ఆయన లింక్డిన్‌లో ఆ పోస్టు షేర్ చేశారు. దాని ప్రకారం బెంగళూరు చెందిన కె.శివకుమార్ 34 ఏళ్ల కుమార్తె అక్షయ మెదడుల్లో రక్తస్రావం కారణంగా సెప్టెంబర్‌లో ప్రాణాలు కోల్పోయారు. తన కుమార్తె బిటెక్, ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబిఎ పూర్తి చేశారని వెల్లడించారు. ఆమె గోల్డ్‌మన్ శాక్స్‌లో కూడా పనిచేశారు. కూతురు మరణించిన తర్వాత లాంఛనాలు పూర్తిచేసి, సంబంధిత పత్రాలు పొందేందుకు అంబులెన్స్ ఆపరేటర్లు, పోలీసు అధికారులు, శ్మశానవాటిక సిబ్బంది, స్థానిక యంత్రాంగానికి చెందిన ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్కరికి లంచం ఇవ్వాల్సి వచ్చిందని వెల్లడించారు. నా బిడ్డ మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్స్ డ్రైవర్ రూ.3 వేలు వసూలు చేశాడు. ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్ట్ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళితే బహిరంగంగానే నగదు డిమాండ్ చేశారు. ఉన్న ఒక్కగానొక్క బిడ్డ చనిపోయి నేనుంటే అలాంటి తండ్రిపట్ల వారు ఎలాంటి కనికరం చూపలేదు. నా దగ్గర డబ్బు ఉంది. ఇచ్చాను. కానీ పేదవాళ్ల పరిస్థితి ఏంటి? ఇలా డబ్బు వసూలు చేసినప్పుడు తమకు ఒక కుటుంబం ఉందన్న ఆలోచన వారికి రాదా? అంతేగాక మరణ ధృవీకరణపత్రం కోసం నేను ఇబ్బంది పడాల్సి వచ్చింది. రాష్ట్రంలో కుల గణన జరుగుతోందని, సిబ్బంది ఎవరూ లేరని అయిదురోజుల పాటు తిప్పి పంపారు. అధికారిక రుసుం కంటే ఎక్కువ మొత్తం చెల్లించిన తరువాత బెంగళూరు మహానగర పాలక సీనియర్ సిబ్బంది దానిని జారీ చేశారు. నారాయణమూర్తి, అజీజ్ ప్రేమ్‌జీ, కిరణ్ మజుందార్ షా వంటి బిలియనీర్లు ఈ నగరాన్ని కాపాడగలరా? అని ఆ తండ్రి ఉద్వేగానికి గురయ్యారు. అయితే ఆ తర్వాత తన పోస్టును ఆయన తొలగించారు. అయినప్పటికీ ఇందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్లు వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ పోస్టు తమ దృష్టికి వచ్చిన వెంటనే బెంగళూరు వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ ఉన్నతాధికారులు తక్షణం స్పందించారు. ఈ కేసులో లంచం ఆరోపణలు ఎదుర్కొన్న ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా అనిచుత ప్రవర్తనను పోలీస్ శాఖ సహించదని పేర్కొన్నారు.



# ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం

**ఆర్‌జెడి- కాంగ్రెస్ బంధాన్ని '5కె'గా అభివర్ణన**

**ఆ పార్టీలది ఆటవిక పాలన, అభివృద్ధి ఉండదు**

**ముజఫర్‌పూర్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ**

**ముజఫర్‌పూర్, అక్టోబరు 31 :** కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు దశాబ్దాలపాటు బీహార్‌ను పాలించారు, కానీ అభివృద్ధి చేయలేదు. కేవలం ద్రోహం, తప్పుడు వాగ్దానాలు మాత్రమే ఇచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆరోపణలు గుపించారు. ఆ రెండు పార్టీల మధ్య ఉన్న సంబంధం నీళ్లు, నూనె లాంటిదని విమర్శించారు. గురువారంనాడు ముజఫర్‌పూర్ లో నిర్వహించిన ఎన్నికల సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఆర్‌జెడి- కాంగ్రెస్ కూటమిపై విమర్శలు గుప్పించారు. ఓట్ల కోసం ఛాత్ ఉత్సవాన్ని కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు అవమానిస్తున్నాయి. ఛాత్ పూజను డ్రామాగా పేర్కొన్నాయని, ఈ అవమానాన్ని బీహార్ ప్రజలు ఎన్నేళ్లయినా మర్చిపోరని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. బీహారీ ప్రజలు గొప్పగా జరుపుకునే ఛాట్ పూజకు యునెస్కో వారసత్వ సంపద గుర్తింపు తీసుకురానున్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. "ఛట్ పూజ తర్వాత ఇది నా మొదటి బిహార్ పర్యటన. ఇది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ పండుగు భక్తికి మాత్రమే కాదు. సమానత్వానికి నిలయం. ఛట్ పాటలను ప్రోత్స హించడానికి కేంద్ర ప్రభుత్వం ఓ పోటీని నిర్వహించనుంది. పోటీ విజేతను ప్రజలే నిర్ణయిస్తారు. వచ్చే ఏడాది ఛట్ పండు గకు ముందు విజేతలను గుర్తిస్తారు. ఛట్ పూజ సంప్రదాయాలను యువత పాటల ద్వారా పెద్ద నుంచి నేర్చుకుంటారు. దానిని దృష్టిలో పెట్టుకుని బహుళ కళాకారులతో కలిసి మేం ఈ ఛట్ పాటల పోటీని నిర్వహిస్తాం. ఇందులో దేశవ్యాప్తంగా అన్ని భాషల ప్రజలు పోటీ పడటానికి అవకాశం లభిస్తుంది" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. "బీహార్ మధురమైన భాషను, సంస్కృతిని ప్రపంచంలోని ప్రతి మూలకు వ్యాప్తి చేయడం, గౌరవాన్ని పెంచడం, అభివృద్ధి చేయడం ఎన్‌డిఏ, బిజెపికి అతి పెద్ద ప్రాధాన్యత. వికసిత్ భారత్ కోసం వికసిత్ బీహార్ చాలా అవసరం" అని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు ఎక్కడ ఉంటే అక్కడ ఆటవిక రాజ్యం వస్తుందని, ఎక్కడైతే ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీల దుష్పరిపాలన ఉంటుందో అక్కడ అభివృద్ధి జాడ కనిపించదని అన్నారు. ఎక్కడ అవినీతి ఉంటుందో అక్కడ సామాజిక న్యాయం జరగదని చెప్పారు. పేదల హక్కులు దోచుకుంటారని, కొన్ని కుటుంబాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని అన్నారు. అలాంటి వ్యక్తులు బీహార్‌కు ఎప్పటికీ మంచి చేయలేరని ఆరోపించారు. "కాంగ్రెస్- ఆర్‌జెడి కూటమి పాలన ఐదు 'కే' పదాల్లో చెప్పొచ్చు. కట్టా (నాటు తుపాకీలు), క్రూరతా(క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్(అవినీతి)" అని ప్రధాని మోడీ ఆరోపణలు గుప్పించారు. "కాంగ్రెస్- ఆర్‌జెడి పార్టీల నేతలు బయటకు కలిసి ఉన్నట్టు కనిపించినా అంతర్గతంగా కొట్లాడుకుంటారు. బీహార్‌లో ఆర్‌జెడి పాలనలో 35వేల నుంచి 40వేల కిడ్నాప్‌లు జరిగాయి. ఆ పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో నేటి యువత ఊహించలేరు. ఏడుస్తూ, బాధపడుతూ ఉన్న తల్లిదండ్రుల బాధలు అప్పట్లో ఆర్‌జెడికి ఏమాత్రం పట్టనట్టు ఉండేవి. నేటికీ కూడా ప్రజల సంతోషం లేదా దుఃఖం గురించి ఎలాంటి ఆందోళన లేదు" అని ప్రధాని మోడీ మండిపడ్డారు. రైల్వేను లూటీ చేసినవాళ్లు.. బీహార్ ప్రాంతాన్ని ఎలా డెవలప్ చేస్తారని అన్నారు. బీహార్‌లో జంగిల్‌రాజ్ నడిచిందని, షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారని ఆరోపించారు.

# వర్క్ పర్మిట్ల ఆటోమేటిక్ రెన్యువల్ రద్దు

## వేలాది మంది భారతీయ ఉద్యోగులపై పిడుగు!



**వాషింగ్టన్, అక్టోబరు 31 :** వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. వలసదారుల పని అనుమతులను ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేసే విధానానికి ముగింపు పలికింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ మేరకు ప్రకటన చేసింది. దీంతో వేలాది మంది విదేశీయులు ముఖ్యంగా భారతీయులు తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. 'అక్టోబరు 30 లేదా ఆ తర్వాత నుంచి వర్క్ పర్మిట్లను (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్స్) పునరుద్ధరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదు. అయితే ఈ తేదీ కంటే ముందు పని అనుమతులను పొడిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదు' అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ ప్రకటనలో వెల్లడించింది. ప్రజా భద్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్లు తెలిపింది. గతంలో బైడెన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వలసదారులు తమ వర్క్ పర్మిట్ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా 540 రోజుల వరకు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు వీలుండేది. ఈ విధానానికి ముగింపు పలుకుతూ తాజాగా ట్రంప్ సర్కారు కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. పని అనుమతుల పొడిగింపు కోసం వలసదారులు ముందుగానే దరఖాస్తు చేస్తు కోవాలని అగ్రరాజ్య అధికారులు స్పష్టం చేశారు. 'ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ల (ఇఏడి) రెన్యువల్ కోసం దరఖాస్తులను వలసదారులు ఎంత ఆలస్యం చేస్తే వారికి అంత నష్టం. తాత్కాలికంగా పని అనుమతులను కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే వర్క్ పర్మిట్ల గడువు ముగియ దానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పిస్తే మంచిది' అని యుఎస్‌సిఐఎస్ సూచించింది. అమెరికాలో ఉద్యోగం అవకాశం మాత్రమేనని, వలసదారుల హక్కు కాదని యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ అన్నారు. ఏమిటీ ఇఏడి? ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఇఏడి) అనేది ఓ వ్యక్తికి నిర్దిష్ట కాల వ్యవధి వరకు అమెరికాలో పనిచేసేందుకు అధికారం ఉందని నిరూపించే పత్రం. ఇది ఉంటేనే వలసదారులు అమెరికాలో ఉద్యోగం చేసుకు నేందుకు అనుమతులు లభిస్తాయి. అయితే, గ్రీన్‌కార్డుతో శాశ్వత నివాసం పొందిన వారు ఈ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

# బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో నకిలీ శాస్త్రవేత్త అరెస్ట్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 31 :** ప్రముఖ అణు పరిశోధనా విభాగం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో నకిలీ శాస్త్రవేత్తగా చలామని అవుతున్న అక్తర్ కుతుబుద్దీన్ హుస్సేనీ ఇటీవల అరెస్టయ్యాడు. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వద్ద అణు కార్యక్రమాలకు సంబంధించిన కీలకమైన డేటాతో పాటు 14 మ్యాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిలో సున్నితమైన సమాచారం ఏదైనా ఉందా అన్న కోణంలో పరిశీలిస్తున్నామన్నారు. గతవారం ముంబయిలో అరెస్టయిన అక్తర్ నుంచి అనేక నకిలీ పాస్‌పోర్టులు, ఆధార్, పాన్‌కార్డులు గుర్తించారు. వీటితో పాటు బార్క్‌కు సంబంధించిన రెండు నకిలీ ఐడి కార్డులు కనుగొన్నారు. ఇతడు కొన్ని నెలలుగా అనేక అంతర్జాతీయ కాల్స్ చేశాడని, ఆ రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. న్యూక్లియర్ డేటాకు సంబంధించి అక్తర్‌కు పలు విదేశీ నెట్‌వర్క్‌లతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. జంషెడ్‌పుర్ నివాసి అయిన అక్తర్ నకిలీ పాస్‌పోర్టుతో కొంతకాలం దుబాయ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆ తర్వాత అతడు అక్కడ బహిష్కరణకు గురయ్యాడని వెల్లడించారు. ఈ క్రమంలో నకిలీ పాస్‌పోర్టులు ఉపయోగించి దుబాయ్, ఇరాన్ వంటి ఇతర దేశాల్లోనూ ప్రయానించినట్లు గుర్తించారు. ఇరానియన్ గూఢచారులతో జరిగిన ఓ ఒప్పందం ద్వారా వచ్చిన డబ్బుతో విదేశాల్లో పెట్టుబడి పెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గూఢచర్యానికి పాల్పడుతూ నకిలీ పాస్‌పోర్ట్ రాకెట్ నడుపుతున్న ఆరోపణపై అక్తర్ సోదరుడు మహమ్మద్ అదిల్ హుస్సేనీని కూడా ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు.

# ట్రంప్‌ను ఎదుర్కొనే ధైర్యం మోడీకి లేదు

**రెండేళ్లలో బీహార్‌లో ఎన్డీయే చేసిందేమీ లేదు**

**ఓటు చోరీతోనే కేంద్రంలో అధికారంలోకొచ్చింది**

**నలంద ఎన్నికల సభలో రాహుల్ ఆరోపణలు**



**నలంద, అక్టోబరు 31 :** "భారత్- పాకిస్తాన్ మధ్య వివాదం తన వల్లే ఆగిపోయిందని అమెరికా అధ్యక్షుడు చాలాసార్లు పేర్కొన్నారు. కానీ, మన ప్రధానమంత్రి మోడీకి ఆయనను ఎదుర్కొనే ధైర్యం లేదు" అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నలందలో నిర్వహించిన ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ, బీహార్ ఇప్పుడు పేపర్ లీకేజీలు, కనీస ఆరోగ్య మౌలిక సదుపాయాలకు కరువైన ప్రాంతంగా మారిందన్నారు. 20ఏళ్ల ఎన్‌డిఏ పాలనలో బీహార్‌లో చేసిందేమీ లేదని, పెద్దలకు, పారిశ్రామిక వేత్తలకు భూములు, రాయితీలు, ప్రోత్సా హకాలిచ్చారు అంటూ ఆరోపణలు గుప్పించారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్‌డిఏ ఓటు చోరీ ద్వారా విజయం సాధించిందని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు. బీహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, అది రైతులు, కార్మికులు, దళితులు, బలహీన వర్గాల ప్రభుత్వం అవుతుందని, అన్ని వర్గాల ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వ విద్యాలయం నలందలో వస్తుందని హామీనిచ్చారు.

## సంక్షిప్తంగా..

### లావ్రే మ్యూజియం చోరీకేసులో అయిదుగురి అరెస్ట్



**ప్యారిస్, అక్టోబరు 31 :** ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్ట్ మ్యూజియం లావ్రేలో భారీ చోరీ కేసులో తాజాగా ఐదుగురు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్ చేసారు. మ్యూజియంలోని అపోలో గ్యాలరీ నుంచి దాదాపు 102 మిలియన్ డాలర్ల విలువైన ఆభరణాలను దొంగలు అపహరించారు. ఈ విషయాన్ని ఫ్రెంచ్ మీడియా నివేదించింది. ఇప్పటికే ఇద్దరు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్ చేసారు. దోపిడీలో తమ ప్రమేయం ఉందని నిందితులు అంగీకరించినట్లు పారిస్ ప్రాసిక్యూటర్ లారే బెకువా తెలిపారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రసిద్ధి చెందిన లూవ్రా మ్యూజియంలో ఈనెల 19న భారీ చోరీ జరిగింది. మోనాలిసా లాంటి కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియంలో నెపోలియన్ కాలం నాటి ఆభరణాలను అపహరించారు.

### నటుడు ప్రభు, అమెరికా కాన్సులేట్‌లకు బాంబు బెదరింపులు



**చెన్నై, అక్టోబరు 31 :** చెన్నైలో మరోసారి బాంబు కలకలం రేగింది. ప్రముఖ నటుడు ప్రభు నివాసంతో పాటు, అమెరికా రాయబార కార్యాలయానికి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ఈమెయిల్‌తో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తమిళనాడు డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఓ ఈమెయిల్‌లో ఈ బెదిరింపులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చెన్నైలోని అన్నా ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న అమెరికా కాన్సులేట్‌లో, ఆ తర్వాత నటుడు ప్రభు ఇంట్లో బాంబు పేలుతుందని దుండగులు హెచ్చరించారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే చెన్నై పోలీసులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో రంగంలోకి దిగారు. అమెరికా కాన్సులేట్ భవనం, నటుడు ప్రభు నివాసం వద్ద భద్రత కట్టుదిట్టం చేసారు.

### అయోధ్య రామమందిరానికి రూ.3 వేల కోట్ల విరాళాలు

**అయోధ్య, అక్టోబరు 31 :** అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం ప్రజలు రూ.3 వేల కోట్లకుపైగా విరాళాలు ఇచ్చినట్లు రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆలయ ప్రాజెక్టు మొత్తం ఖర్చు దాదాపు రూ.1,800 కోట్లని.. ఇప్పటి వరకూ రూ.1,500 కోట్ల బిల్లులు చెల్లించినట్లు వెల్లడించారు. 2022లో నిర్మాణం కోసం విరాళాలు ప్రకటించినప్పటి నుంచి ఈ మొత్తం వచ్చినట్లు తెలిపారు. నవంబరు 25న ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకలకు దాతలందరినీ ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. ఆరోజు ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరవుతారని, రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరిస్తారని వివరించారు. దాదాపు 8 వేల మందికిపైగా ఆహ్వానితులు ఇందులో పాల్గొంటారని ఆయన చెప్పారు.

### నవంబరు 1నుంచి అయ్యప్ప దర్శనాల ఆన్‌లైన్ బుకింగ్



**పతనంతిట్ట, అక్టోబరు 31 :** శబరిమల అయ్యప్పస్వామి దర్శనాలకు చెందిన ఆన్‌లైన్ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ ఏడాది కూడా భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం రానున్నారు. మండల పూజ సీజన్ నవంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. డిసెంబర్ 27వ తేదీన ఆ సీజన్ ముగుస్తుంది. ఇందు కోసం ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అయ్యప్ప స్వామి దర్శనం కోసం వర్చువల్ క్యూ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు బోర్డు ప్రకటించిది. ప్రతి రోజు 70 వేల మంది భక్తులకు క్యూలైన్ టికెట్లను అమ్మనున్నారు. ఇక స్పాట్ బుకింగ్ కోసం 20 వేల టికెట్లను కేటాయించారు. మండల సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించింది. పంబ వద్ద భారీ పందిరిని నిర్మించనున్నారు.

### గ్లోబల్ సెక్యూరిటీ హబ్‌గా భారత్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 31 :** భారత్ వేగంగా గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ హబ్‌గా అవతరిస్తోందని, ఈ రంగంలో 400కు పైగా స్టార్టప్‌లు, 6.5 లక్షల మంది నైపుణ్యం కలిగిన నిపుణులతో దేశ సైబర్ భద్రతా పరిశ్రమ 20 బిలియన్ డాలర్ల స్థాయికి చేరిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన సెర్ట్‌ఇన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ బహల్ తెలిపారు. ఐరోపా సమాఖ్య దేశాల నుంచి వచ్చిన బృందంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఆవిష్కర్తలు థ్రెట్ డిటెక్షన్ సైబర్ ఫోరెన్సిక్స్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల వంటి అత్యాధునిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారని, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని నిర్మించడంలో ఇది కీలకమని ఆయన వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదన్నారు.

# దక్షిణ,ఈశాన్య భారత్‌పై దావూద్ గ్యాంగ్ ఫోకస్!



**న్యూఢిల్లీ, అక్టోబరు 31 :** దావూద్ ఇబ్రహీంకు చెందిన డ్రగ్స్ సిండికేట్‌పై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఉక్కుపాదం మోపుతోంది. గత కొన్ని నెలలుగా మహారాష్ట్ర కేంద్రంగా పనిచేస్తున్న ఈ నెట్‌వర్క్‌పై ఎన్‌సీబీ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. డానిష్ చిక్నా, మహమ్మద్ సలీం షేక్ వంటి కీలక సభ్యుల అరెస్టులతో డీగ్యాంగ్ భారీగా దెబ్బతింది. దీంతో నష్టాల నుంచి గట్టెక్కేందుకు, తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ సిండికేట్ ఇప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇంటెలిజెన్స్ ఏజెన్సీల కథనం ప్రకారం, ఇప్పటివరకు మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలే కేంద్రంగా పనిచేసిన దావూద్ నెట్‌వర్క్.. ఇప్పుడు దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మహారాష్ట్రలో నిఘా తీవ్రతరం కావడంతో అక్కడి నుంచి దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరాను నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో కార్యకలాపాల కేంద్రాన్ని మార్చాలని డీసిండికేట్ నిర్ణయించింది. ప్రస్తుతం భారత డ్రగ్స్ మార్కెట్ బాధ్యతలను ఐఎస్ఐ ఏజెంట్, దావూద్ అనుచరుడైన హాజీ సలీం చూసుకుంటున్నాడు. గతంలో దావూద్ కుడిభుజంగా ఉన్న ఛోటా షకీల్ కొంతకాలంగా తెరమరుగు కావడంతో సలీం ప్రాధాన్యత పెరిగింది. అంతర్జాతీయ వ్యవహారాలను దావూద్ సోదరుడు అనీస్ ఇబ్రహీం పర్యవేక్షిస్తుండగా, భారత్‌లో కార్యకలాపాలు మొత్తం సలీం చేతుల మీదుగానే సాగుతున్నాయి. ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం, శ్రీలంక మార్గం ద్వారా తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు భారీగా డ్రగ్స్ చేరవేసి, అక్కడి నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు భూమార్గంలో సరఫరా చేయాలని డీసిండికేట్ ప్లాన్ చేస్తోంది. ఇప్పటివరకు దేశం నుంచి విదేశాలకు డ్రగ్స్ పంపేందుకు దక్షిణాది ప్రాంతాన్ని వాడుకున్న ఈ ముఠా, ఇప్పుడు దేశంలోకి డ్రగ్స్ తెచ్చేందుకు ఇదే మార్గాన్ని ఎంచుకుంది.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు ఉక్కు పాదం మోపుదాం

**○ జిల్లా కలెక్టర్ ఆదేశం**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఉక్కుపాదం మోపుదామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఆవిష్కృతం చేయాలన్నారు. జిల్లాలో గట్టి నిఘా ఉండాలని అన్నారు. రవాణా వ్యవస్థపైన, విద్యా సంస్థలుపైన నిఘా ఉండాలని చెప్పారు. అన్ని పాఠశాలలు, కళాశాలలలో ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయాలని, ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు, మాదక ద్రవ్యాల దిశగా అడుగులు వేయకుండా అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. మత్తు, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం, తయారీ, సరఫరా వంటి సమాచారం
ఎక్కడ ఉన్నా తక్షణం పోలీసు అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. మందుల దుకాణాలలో కొన్ని మందులను వైద్యుల సలహాల మేరకు మాత్రమే వినియోగించాలని, నిబంధనలు ఉల్లంఘించే మందుల దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో ముఖ్యంగా యువతలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, మత్తు మాదక ద్రవ్యాలు వలన ఆరోగ్యంపైనా, ఆర్థికంగాను పడే ప్రభావాలు తెలియజేయాలని అన్నారు. మాదక ద్రవ్యాలు వలన కుటుంబం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా బంధువులను, స్నేహితులను కోల్పోవడం జరుగుతుందని వివరించారు.

పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో 2025 సంవత్సరంలో ఇప్పటి వరకు 65 కేసులు నమోదు చేశామని, 26 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఏడుగురుపై పి.డి కేసులు నమోదు చేశామని వివరించారు. ఒడిశా రాష్ట్రంతో పాటు, ఆ రాష్ట్ర సరిహద్దుల జిల్లాల నుండి రవాణా ద్వారా జిల్లాకు చేరడంతో పాటు ఇతర నగరాలకు రవాణా అవుతున్నట్లు గుర్తించామని వివరించారు. మత్తు మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా, వినియోగం, రవాణాలో ఎక్కువ సార్లు భాగస్వామ్యం అవుతున్న వ్యక్తులపై హిస్టరీ షీట్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 130 మంది ఎక్కువ సార్లు ఈ కార్యకలాపాలలో భాగస్వామ్యం అయినట్లు గుర్తించామన్నారు. నగర పాలక సంస్థ శివారు ప్రాంతాల్లోను, నిరుపయోగంగా ఉన్న భవనాల్లోనూ గంజాయి, మత్తు పదార్థాల వినియోగదారులు చేరుతున్నట్లు సమాచారం అందుతుందని, అటువంటి ప్రదేశాల పట్ల నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని కోరారు. 839 ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒత్తిడి నివారణ మాత్రలను వైద్యుల చీటి లేకుండా మందుల దుకాణాలు విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం ఉందని, దానిపై దృష్టి సారించాలని అన్నారు. వసతి గృహాల్లోనూ నిఘా ఉండాలని, సామాన్య వస్తువులుగా ప్యాకింగ్ చేసి ఆర్.టి.సి, రైలు, ఇతర మాధ్యమాల ద్వారా రవాణా చేస్తున్నారని వాటి పట్ల డ్రైవర్లకు, కండక్టర్ లకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా విద్యా శాఖ అధికారి సి.వి. రేణుక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జె.పద్మ, డ్రగ్స్ నియంత్రణ అధికారి లక్ష్మణ రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గా భాయి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే 16 వినతులు స్వీకరణ



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పలువురు పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, సర్వీసు, బదిలీలు మరియు పరిపాలనా సంబంధిత వినతులను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 16 వినతులు స్వీకరించగా, వాటిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

వినతులను సమయానుకూలంగా పరిష్కరించేలా కఠినమైన దిశానిర్దేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యం అని తెలిపారు. ఎటువంటి సంకోచం లేకుండా సిబ్బంది నేరుగా వచ్చి వినతులు సమర్పించాలని సూచించారు. సిబ్బంది సమస్యలు పరిష్కారమైతేనే వారు ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరని అభిప్రాయపడ్డారు.

అలాగే సిబ్బంది విధుల్లో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల్లో నమ్మకం, భరోసా పెంపొందేలా వ్యవహరించి, నాణ్యమైన పోలీస్ సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. "పోలీస్ శాఖ ఒక కుటుంబంలాంటిది. పరస్పరం అర్థం చేసుకుంటూ, సహకార భావంతో పనిచేయాలి. సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేం డిఎస్పి రాజేంద్రప్రసాద్




**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీస్ అమరవీరుల వారోత్సవల్లో భాగంగా వారి త్యాగాలను స్మరించుకుంటూ మైదుకూరు పట్టణంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కడప రోడ్డు పోలీస్ స్టేషన్ నుంచి కృష్ణదేవరాయల కూడలి వరకు పోలీసులు ర్యాలీ చేపట్టారు. కూడలిలో ఘనంగా అమరులకు నివాళులర్పించారు. అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుని నిష్పక్షపాత ప్రజాసేవ రక్షణ కల్పించేది పోలీసు శాఖ మాత్రమే అన్నారు. వారి త్యాగాలను ఎన్నటికీ మరువలేమని కొనియాడారు ఈ కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ సీఐ రమణారెడ్డి రూరల్ సీఐ శివశంకర్ కాజీపేట సీఐ వంశీధర్ మైదుకూరు అర్బన్ ఎస్ఐ చిరంజీవి సుబ్బారావు చాపాడు ఎస్ ఐ చిన్న పెద్దయ్య దువ్వూరు ఎస్సై వినోద్ సబ్ డివిజన్లోని పోలీసులు విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

# పోలీస్ సేవలకు ఘనాభినందనలు







**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం రిటైర్ అవుతున్న ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసిన పోలీసు సిబ్బందిని గౌరవించారు.

సుదీర్ఘ సేవల అనంతరం ఎస్ఐలు టి. సుబ్బారావు, బి. జయరాణి, వీ.ఎన్. మల్లేశ్వరరావు సేవా విరమణ పొందారు. టి. సుబ్బారావు 1983లో పోలీసు శాఖలో చేరి 42 సంవత్సరాల సేవ అనంతరం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా రిటైర్ అయ్యారు. బి. జయరాణి 1984లో చేరి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి రిటైర్ అయ్యారు. వీ.ఎన్. మల్లేశ్వరరావు 1984లో చేరి తెనాలి పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐగా సేవలు అందించి సేవా విరమణ పొందారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా భద్రత కోసం జీవితాంతం సేవలందించిన అధికారులకు శాఖ తరఫున ధన్యవాదాలు తెలిపారు. నక్సలిజం ప్రభావిత కాలంలో ప్రజల రక్షణ కోసం చేసిన సేవలు గుర్తుండిపోయేలా ఉన్నాయని పేర్కొన్నారు. సేవా విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమాన్ని ఎం.టి.ఎం.సి పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీహరి రెడ్డి సమన్వయం చేశారు. పోలీస్ అసోసియేషన్ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# రీ ఫిల్లింగ్ చేస్తున్న 29 గ్యాస్ సిలిండర్‌లు స్వాధీనం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు పశ్చిమ మండలం పరిధిలోని దాసరిపాలెం నందు వద్దే వెంకటరమణారెడ్డికి చెందిన విజయశ్రీ బిల్డింగ్ మెటీరియల్ వాణిజ్య సముదాయం లో గుంటూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, స్థానిక సివిల్ సప్లై ,రెవిన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీ జరిపారు. ఈ తనిఖీలలో గృహ అవసరాల కి వినియోగించే 29 గ్యాస్ సిలిం ఎలాంటి అనుమతులు లేకుండా, ఉన్నట్లు గుర్తించారు. చట్ట విరుద్ధంగా, తగు జాగ్రత్తలు చేపట్టకుండా అధిక ధరలకు చిన్నచిన్న సిలిండర్స్ నందు చిన్న మోటారు ద్వారా రీఫిలింగ్ చేస్తున్నట్లు కనుగొన్నారుగు, సదరు షాప్ నందు నిల్వ ఉన్న 29 డొమెస్టిక్ సిలిండర్స్ ఒక మోటార్ (1/2 హెచ్పీ మోటర్) స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం స్థానిక సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ వెంకట్రావుకి అప్పగించి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సి.ఐ, కె. చంద్ర శేఖర్,లక్ష్మీ మాధవి, మండల సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ ఎం. వెంకటరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

## సర్దార్ వల్లబాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**○ ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఉక్కుమనిషి, భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లబాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని ఏపీ ఎస్పీ ఆరవ బెటాలియన్ లో ఏక్తా దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చాక భారతదేశానికి మొట్టమొదటి హోం మంత్రిగా సేవలందించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ రక్షణ, సమగ్రత కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విధుల్లో పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని రాష్ట్రీయ ఏక్తా దివస్ గా జరుపుకుంటామని, విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన వల్లభాయ్ పటేల్ జీవితం మనకు ఆదర్శప్రాయమన్నారు. బ్రిటిష్ వారు భారత్ ను విడిచి వెళ్ళాక దేశ రక్షణ, సమగ్రత కోసం ఆయన ఎంతో కృషి చేశారని, అందుకే ఆయనకు ఉక్కుమనిషి అనే పేరు వచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతు, రవి తో పాటు పలువురు బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో పంట పొలాలు పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు

**○ రైతులకు పలు సూచనలు చేసిన శాస్త్రవేత్తలు**



**ఉమ్మడి గుంటూరుజిల్లా(జర్నలిస్ట్ ఫైల్):** మెంథా తుఫాను నేపథ్యంలో పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు, , ఆధ్వర్యంలో మాచర్ల మండలం కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల పరిధి సాగులో ఉన్నటువంటి ఉద్యాన పంటలు శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు లాం ఫామ్ కీటక శాస్త్రవేత్త డాక్టర్ బి. నాగేంద్ర రెడ్డి, , గ్రామాలలో సాగులో ఉన్న మిరప, పుచ్చ సాగు ను పరిశీలించారు.. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ మెంథా తుఫాను యొక్క ప్రభావం వలన ఉద్యాన పంటల యందు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు..

మిరప పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు

మొదటగా మిరప తోటల యందు నీరునిలబడి ఉండకుండా బయటకు వెళ్లే మార్గాలను ఏర్పరుచుకోవాలి. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి. మొక్కలు ఉరుకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలి. వడలిని మొక్కలకు లీటర్ నీటికి ఐదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కల్పిన ద్రావణం పిచికారి చేయాలి ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటికి 50 గ్రాములు అన్న భేది తో పాటు ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారి చేయాలి. పై పాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా 250 కిలోల వేప పిండి వేయాలి. నేల అధును వచ్చిన వెంటనే గొర్రు అంతర కృషి చేయాలి. మొక్కలు తెరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని ఐదు గ్రాములు లీటర్ నీటికి మరియు సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.50 గ్రాములు లీటర్ నీటికి ఒకదాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ, కొయినో ఫోర వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిరైడ్ మరియు ఒక గ్రాము స్టెప్టో సైక్లీన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలి. మిరప పంట ముంపుకు గురై పూర్తిగా పంటకు నష్టం వాటిల్లినప్పుడు పంటను తీసివేసి ప్రత్యామ్నాయంగా వేరొక పంటను సాగు చేసుకోవాలి.

కూరగాయ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు:

పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపివేయాలి, భోదెలపై లేదా బెడ్లపై నాటుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై చేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను కూడా పిచికారి చేసుకోవాలి. నేలకొంచెం ఆరిన తర్వాత రసాయనిక ఎరువులను నేలలో వేసుకోవాలి. అధిక వర్షాలను విత్తనం మొలకెత్తినప్పుడు లేదా లేత మొక్కలు దెబ్బ తిన్నప్పుడు నర్సరీలో నారు పెంచుకొని సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసే కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేటట్లు చేసుకోవాలి. మొక్కలకు ఊతం ఇవ్వడం, పందేళ్లపై తీగజాతి కూరగాయలను సాగు చేసుకోవటం వంటివి చేయాలి?

సస్య రక్షణ చర్యలు: ఆకు తినే పొగాకు లద్దెపురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి. (అన్ని కూరగాయ పంటలు) అక్షంతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిఫైరిఫాస్ ఏ 2 మి. లీ./లీ లేదా థయోడికార్బ్ ఏ 1 గ్రా/లీ పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ ఏ 3 గ్రా/లీ లేదా మోటాలాక్సిల్ ం మంకోజెబ్ ఏ 2 గ్రా/లీ ను మొక్కల మొదళ్ళలో పోయాలి (మిరప, టమాటా, క్యాబేజీ మొదలైనవి) ఆకు పచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజం ఏ 1 గ్రా/లీ లేదా మంకోజెబ్ 2.5 గ్రా/లీ ను పిచికారి చేసుకోవాలి (మిరప, టమాటా, చిక్కుడు, ఆకుకూరలు) బూజు తెగులు నివారణకు డైమిథో మర్ఫ్ ఏ 1.5 గ్రా/లీ లేదా మెటాలాక్సీల్ ం మంకోజెబ్ ఏ 2.0 గ్రా/లీ ను పిచికారీ చేసుకోవాలి (బీర, కాకర, దోస, పొట్ల, సొర) బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రా/లీ ప్లాంటా మైసిస్ ఏ 2 గ్రా /లీ కలిపి పిసికారి చేసుకోవాలి (టమాటా, వంగా, క్యాప్సికం)

మురుగు నీటిని బయటికి పంపాలి మొక్కలు నీటిలో నాలుగు రోజులకంటే ఎక్కువ ఉన్నట్లయితే వయసుతో సంబంధం లేకుండా వేరే పంటలను వేసుకోవాలి 2-3 మూడుసార్లు 2% యూరియా లేదా 1% పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పిచికారి చేయాలి ప్రాపికొనజాల్ 0.1% మరియు డైఫెన్కోనాజల్ 0.1% ద్రావణాలను రెండు సార్లు వారం వ్యవధిలో మార్చి మార్చి పంట పైన పిచికారి చేసినట్లయితే ఆకుమచ్చ మరియు తాటాకుమచ్చ తెగులను నివారించవచ్చు. సూక్ష్మపోషకాలు మిశ్రమాన్ని 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.

ఈ కార్యక్రమంలో శ్రీ. వై మోహన్, మాచర్ల, గ్రామ ఉద్యాన సహాయకులు వెంకటేశ్వర్లు, తులసి నాయకు మరియు రైతులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో నీరు బయటకు పంపాలి



**○ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పంట పొలాల్లో నీరు బయటకు పంపాలని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. తుఫాను ప్రభావంతో వివిధ పంట పొలాల్లో పరిస్థితిని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. పంటలను ఎట్టి పరిస్థితుల్లోను కాపాడాలని ముఖ్యమంత్రి ఆదేశించి ఉన్నారని చెప్పారు. అందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి సమస్య భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం తగిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

జలవనరుల శాఖ వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేసి పక్కాగా సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.

జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం మాట్లాడుతూ పెదనందిపాడు వద్ద నల్లమడ వాగుకు పరుచూరు, ఆలేరు వాగుల నుండి నీరు చేరి 42,335 క్యూసెక్కుల నీరు ప్రవహించిందని, తద్వారా పంట పొలాల్లో బాగా నీరు చేరిందన్నారు. కొమ్మూరు కాలువ గండి పడిందన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా క్రింద 3746 హెక్టార్లలో పంట నీట మునిగిందన్నారు. ఇందులో కాకుమాను మండలంలో 1326 హెక్టార్లు, పెదకాకాని మండలంలో 460 హెక్టార్లు, పెదనందిపాడులో 363 హెక్టార్లు, మంగళగిరిలో 265 హెక్టార్లు, తాడేపల్లిలో 92 హెక్టార్లు, ప్రత్తిపాడులో 70 హెక్టార్లు, చేబ్రోలులో 7 హెక్టార్లు ఉన్నాయన్నారు.

నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులు తమ ప్రాంతంలో పంటలు, కాలువల పరిస్థితిని వివరించారు. కాలువలకు చేపట్టాల్సిన పనుల వివరాలను తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి తదితరులు పాల్గొన్నారు.

# అధికారగణంపై కౌన్సిలర్లు గరం గరం

**○ సిస్టమ్‌లో మార్పుతెస్తా : కమీషనర్ అప్పలనాయుడు**

**○ అజెండా అంశాలు ఆమోదం చైర్ పర్సన్ టి. రాధిక**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలో ప్రతీ వార్డులోను వీధికుక్కల సమస్య జఠిలంగా ఉందని, శానిటేషన్ సమస్యకు సరైన పరిష్కారం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, శానిటేషన్ వర్కర్లకు వారి విధినిర్వాహణలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు సక్రమంగా లేవని, నెలవారి ఖర్చుల జాబితా చూస్తె లక్షలలో దోపిడీలా ఉందని, ఇలా పలు అంశాలపై అధికారుల తీరును ఆక్షేపిస్తు, అజెండా అంశాలుఆమోదించుకున్న పరిస్థితి అత్యవసర కౌన్సిల్ సమావేశంలో చోటుచేసుకుంది.

పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో, శుక్రవారం,చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఇరవై ఒక్క అంశాల అజెండా చదువుతున్న క్రమంలో, అధికారపక్షం, ప్రతిపక్షం అనే వ్యత్యాసం లేకుండా కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లోని సమస్యలకు, పరిష్కారం కోరుతూ, సమస్యలను ఏకరువు పెట్టారు. రెండవ వార్డు కౌన్సిలర్ అన్నాబత్తుని పద్మజ తమ వార్డులో, గడచిన నాలుగున్నర సంవత్సరాలలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని, వర్క్ లు శాంక్షన్ అయ్యాయని చెబుతారు, పనులు మొదలు పెట్టరంటూ ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు. ఫ్లోర్ లీడర్, 19వ, వార్డు కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తులు ఇదే తరహాలో తమ వారు సమస్యలను ఏకరువు పెట్టారు. 25,వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, పట్టణంలో కామన్ సమస్యగా జఠిలమవుతున్న, వీధి కుక్కల నియంత్రణ పై, అధికారులు సాధించిన పురోగతి చెప్పాలన్నారు. ఇదే అంశంపై పలు వార్డుల కౌన్సిలర్లు తమ గళం కలిపారు. కమీషనర్ అప్పల నాయుడు ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందని కౌన్సిలర్ లు, ఈఅంశంపై, ప్లాన్ ఆఫ్ యాక్షన్ తొపాటు, ఓ కమిటీని ఏర్పాటుచేయాలని, తదుపరి సమావేశం నాటికి పరిస్థితిలో, మార్పు లేకుంటే, వార్డులలో ప్రజల నుండి, కౌన్సిలర్లుగా తాము,అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. 15వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు అంజెండాలోని, కార్యాలయ నెల వారి ఖర్చుల విషయంలో, పలు అంశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, వివరణ కావాలన్నారు. శానిటేషన్ కార్మికుల విధి నిర్వాహణలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించని కారణంగా, వ్యర్థాలు తీసుకు వెళ్ళే, ట్రాక్టర్ పైన, టార్పాలిన్ పట్టా, వేయని కారణంగా, వ్యర్థాలు దారిపొడవున పడుతున్నాయని, ప్రజలు ఆ వ్యర్థాల దుర్గంధాన్ని భరించలేని పరిస్థితి చూస్తున్నామని, అనవసర ఖర్చులు, చూపించి, లక్షలు, లక్షలు బిల్లులు, కౌన్సిల్ ద్వారా ఆమోదించుకుంటున్నారని, అధికారులు సరైన సమాధానం చెప్పలని డిమాండ్ చేశారు. పారిశుధ్య పనివారికి, మౌలికసదుపాయాల కల్పన విషయంపై, అధికారుల సమాధానంలొ స్పష్టత లేక పోవడంతొ, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు అధికారుల తీరును,ఎండగట్టారు. తనే స్వంత డబ్బులతొ పారిశుధ్య సిబ్బంది మౌలిక అవసరాలు తీర్చమంటార, అధికారులు సకాలంలొ సమస్య పరిష్కరిస్తారా అనే విషయం స్పష్టంగా చెప్పాలన్నారు. పలువురు కౌన్సిలర్ లు, ఈఅంశంపై స్పష్టత కోరారు. ఎట్టకేలకు కమీషనర్ అప్పల నాయుడు సమస్య త్వరిత గతిన పరిష్కరిస్తామని అన్నారు. పలు వార్డులలో, వర్కర్ల కొరత వల్ల శానిటెషన్ పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదని, కౌన్సిలర్ లు, ఆరోపించారు. కౌన్సిలర్ అన్నం పిన్నారావు, తాడిబోయినబ్రహ్మేశ్వరరావు, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, బోయపాటి అరుణ, ఇలా పలువురు కౌన్సిలర్ లు,అభివృద్ధి పనుల నిర్వాహణలొ, అధికారుల సాచివేత ధోరణిపై ప్రశ్నించారు. ఇదే అక్రమంలొ, అజెండాలోని, 7వ, అంశం, పట్టణంలోని బోస్ రోడ్, 2,కోట్ల నిధులతొ,సుందరీకరణ అంశంపై, సభ్యులు తలో విధంగా స్పందించారు.

ఆఖర్చు అనవసరమని, కార్యాలయం వెనుక, సుధీర్గ కాలంగా, నిలిచిపోయిన, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చెయడం కోసం, నిధులు వినియోగిడం ద్వారా, పురపాలక సంఘానికి ఆదాయం సమకూరుతుందనే భావన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు అజెండా అంశాలు ఆమోదించినట్లు, మెజార్టీ సభ్యులు ఆమోదిచడంతొ, అధ్యక్ష స్థానంలొ ఉన్న, చైర్పపర్సన్ తాడిబోయిన రాధిక సమావేశం ముగిసినట్లు ప్రకటించి, అజెండా ఆమోదమైనట్లు ప్రకటించారు. సమావేశంలొ కార్యాలయ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మొంథా తుఫాన్ నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక

- రూ.5,244 కోట్లు నష్టం - తక్షణ సాయానికి వినతి
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలు పంపాలని కోరిన రాష్ట్ర ప్రభుత్వం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర హోం శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక నివేదికను పంపారు. ఇప్పటివరకు ఉన్న అంచనాల ప్రకారం 17 శాఖలు, రంగాలకు సంబంధించి మొత్తం రూ.5,244 కోట్లు నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లింది. ప్రస్తుతం ప్రాథమిక అంచనాల ప్రకారమే నివేదిక సమర్పించామని, పూర్తి స్థాయిలో వివరాలు వస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరింది. ప్రాథమిక నివేదికలో అంశాలవారీగా ఏయే శాఖలు, ఏయే రంగాల వారీగా ఎంతమేర నష్టం వాటిల్లిందన్న సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చింది. అలాగే, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలను పేర్కొంది. ఆర్టీజీఎస్ నుంచి తుఫాన్ ప్రభావాన్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు ప్రభుత్వం ఏ విధంగా తీసుకుందో వివరించింది. 19 జిల్లాలకు ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్టు తెలిపింది. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువుగా ఉందని నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలోని 249 మండలాల పరిధిలోని 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుఫాన్ ప్రభావం పడింది. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని స్పష్టం చేసింది. తుఫాన్ వల్ల సంభవించిన నష్టాన్ని శాస్త్రీయంగా మదింపు చేసినట్టు పేర్కొంది. ఈ మేరకు తుఫాన్ తీవ్రతను అద్దం పట్టేలా ఫోటోలను లేఖతో జతపరిచి... తుఫాన్ నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందాలను పంపాల్సిందిగా కోరింది.

**దెబ్బతిన్న 4,794 కి.మీ. ఆర్ అండ్ బీ రహదారులు :** అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం... అత్యధికంగా రహదారులు, వ్యవసాయం-అనుబంధ రంగాల్లో నష్టం సంభవించినట్టు పేర్కొన్నారు. తుఫాన్ వల్ల ముగ్గురు మరణించినట్టు వెల్లడించారు. 4,794 కి.మీ. మేర ఆర్ అండ్ బీ రహదారులు, 311 కల్వర్టులు-బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. ఈ నష్టం రూ.2,774 కోట్ల మేర ఉందని వివరించారు. 18 జిల్లాల్లోని 862 కి.మీ. మేర పంచాయతీ రాజ్ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఈ శాఖకు రూ.454 కోట్ల నష్టం జరిగింది. 48 పట్టణ ప్రాంతాల్లోని రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతులు విధ్వంసమయ్యాయి. వీటి పునరుద్ధరణకు రూ.109 కోట్లు వ్యయం కానుందని నివేదికలో చెప్పారు.

**1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం :** వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్లలోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయని... దీంతో రూ.829 కోట్ల వరకు రైతులు నష్టపోయినట్టు నివేదిక చెబుతోంది. మొత్తం 1.74 లక్షల మంది రైతులపై తుఫాన్ ప్రభావం చూపించింది. 12,215 హెక్టార్లలోని రూ.40 కోట్ల విలువైన ఉద్యానపంటలు దెబ్బతినగా 23,979 మంది ఉద్యాన రైతులకు నష్టం జరిగింది. ఆక్వారంగంలో 32 వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారు. మరోవైపు 2,261 పశు సంపదను నష్టపోయారు.

**విరిగిపడ్డ 2,817 విద్యుత్ స్తంభాలు :** రాష్ట్రంలోని 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, 26,575 డీటీఆర్‌లు ధ్వంసమయ్యాయి. 429 కి.మీ. మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీని వల్ల విద్యుత్ శాఖకు రూ.19 కోట్ల వరకు నష్టం జరిగింది. ఇక, రూ.234 కోట్ల మేర నష్టం నీటిపారుదల శాఖకు కలిగింది. అలాగే, 23 జిల్లాల పరిధిలోని 3,045 ఇళ్లు ధ్వంసమైనట్టు ప్రాథమిక నివేదికలో గుర్తించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, చేనేత మగ్గాలు అన్నీ కలిపి రూ.122 కోట్ల నష్టం వాటిల్లింది. మరోవైపు, 1,464 చోట్ల రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేయగా 1,36,907 మందికి పునరావాసం కల్పించారు. సహాయక చర్యల కోసం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ.32 కోట్లు ఖర్చు పెట్టినట్టు అధికారులు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

## నారా రోహిత్ వివాహానికి సీఎం చంద్రబాబు, భువనేశ్వరి హాజరు



- వధూవరులను ఆశీర్వదించిన సీఎం దంపతులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నారా కుటుంబంలో వివాహ వేడుక ఘనంగా సాగింది. సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కుమారుడు, సినీనటుడు నారా రోహిత్ వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి హాజరయ్యారు.

వివాహ వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు నూతన వధూవరులు రోహిత్, శిరీషలకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వాదాలు అందజేశారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, పలువురు ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు ఈ సందర్భంగా పాల్గొన్నారు. వివాహోత్సవం సందడి, ఆనందభరిత వాతావరణంలో జరిగింది.

## ఘనంగా జాతీయ ఏకతా దినోత్సవం




**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఏకతా దినోత్సవం భాగంగా నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, మంగళగిరిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం (31-10-2025 నుండి 07-11-2025 వరకు) ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంచా విజయమోహనరావు, ప్రజాగాయకుడు కంచర్ల కాశయ్య, వార్డు పరిపాలనా కార్యదర్శి జయశ్రీ, డాక్టర్ నాగరాజు (హెచ్ఓడి) ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. జాతీయ ఎన్ఎస్ఎస్ గీతంతో కార్యక్రమం ప్రారంభమై, రాజ్యాంగ పీఠికను పఠించిన అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్ బాబు అతిథులను ఆహ్వానించారు. డాక్టర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ, సేవాభావం, క్రమశిక్షణ, సమాజ పట్ల బాధ్యత వంటి ఎన్ఎస్ఎస్ విలువలు సమాజాన్ని మలుపుతిప్పగలవని, వాలంటీర్లు చేస్తున్న సేవ సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అభినందించారు. మంచా విజయమోహనరావు మాట్లాడుతూ, విద్య అంటే కేవలం పుస్తకాలు, పరీక్షలు, మార్కులు మాత్రమే కాకుండా సమాజాన్ని అర్థం చేసుకోవడం అని, ఎన్ఎస్-ఎస్ సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందిస్తాయని అన్నారు. ప్రజాగాయకుడు కంచర్ల కాశయ్య దేశభక్తి, సాంస్కృతిక గీతాలు ఆలపించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. నేల, సంస్కృతి పట్ల ప్రేమ దేశ బలం అని, యువత ఏకతతో ఉంటే దేశం మరింత ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జయశ్రీ మాట్లాడుతూ సూర్యనారాయణ నగర్‌లో ఈ శిబిరం నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. అనంతరం సమైక్యత ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ భావనా ఋషి గుడి వద్ద ప్రారంభమై మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ చేరుకుంది. అక్కడ స్టూడెంట్ కోఆర్డినేటర్ నివేదిత ఆధ్వర్యంలో సమైక్యత ప్రతిజ్ఞ చేయబడింది. విద్యార్థులు గ్రామ వీధుల్లో పయనిస్తూ జాతీయ ఏకత, సోదరభావ సందేశాలు ప్రజలకు అందించారు.

భోజనానంతరం "ఒక రోజు వృద్ధులకు" కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. వృద్ధులతో సమయాన్ని పంచుకుని వారితో మాట్లాడి వారి మనసులను గెలుచుకున్నారు. కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ పాముల రెడ్డి శిబిరానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోజి బాబు, తేజ శృతి, ఎం.టి.ఎం.సి పాఠశాల హెడ్ మాస్టర్ మంజుల, మానవ వికాస మండలి అధ్యక్షులు రేఖా కృష్ణార్జునరావు, స్టూడెంట్ కోఆర్డినేటర్లు సంజన, కార్తికేయ శ్రీరామ్, షేక్ అస్మా, అక్స సాత్విక, నాగేశ్వరరావు, దివ్యాంజలి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐఆర్ఎస్ అధికారి నాగరాజు జిఎస్టి శాఖకే గర్వకారణం



- సెంట్రల్ జిఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, జిఎస్టీ శాఖలోని ఐఆర్ఎస్ అధికారి ఎం. నాగరాజు అందించిన సేవలు డిపార్ట్మెంట్ లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సెంట్రల్ జి. ఎస్. టి కమిషనర్ సుజిత్ మల్లిక్ పేర్కొన్నారు. శుక్రవారం పలకలూరు రోడ్ లోని గుంటూరు క్లబ్ లో జరిగిన జిఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎం. నాగరాజు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దీనికి రిటైర్డ్ జిఎస్టీ చీఫ్ కమిషనర్ సి. పి. రావు అధ్యక్షత వహించారు. కమిషనర్ సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ.. నాగరాజు శాఖ పరంగా ఎన్నో ప్రభుత్వ అవార్డులు, రివార్డులు పొంది శాఖకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఉద్యోగ సంఘ నేతగా ఉద్యోగుల సంక్షేమానికి మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ కాలం విశ్రాంతికే కాకుండా, శాఖ అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ చీఫ్ కమిషనర్ సి. పి. రావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో దక్షత, సమర్ధత, విశ్వాసనీయత కలిగిన అధికారి నాగరాజు అని ప్రశంసించారు. ఆయన ఉద్యోగ అనుభవాన్ని ఇతరులకు పంచాలని విజ్ఞప్తి చేసారు. జిఎస్టీ అడిషనల్ కమిషనర్ బి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నాగరాజు సేవలు సాటిలేనివన్నారు. ఆయన పనితీరు ఉద్యోగులందరికీ మార్గదర్శకమన్నారు. జిఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసి జిఎస్టీ శాఖలో సుస్థిరమైన స్థానాన్ని నాగరాజు పొందకలిగారన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎం. నాగరాజు మాట్లాడుతూ..విధుల పట్ల అంకితభావం, బాధ్యయుతంగా పనిచేస్తే, ఏ ఉద్యోగికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగరాజును పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగులు సత్కరించి, జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో మాజీ ఎం. ఎల్. సి పందుల రవీంద్ర బాబు, గజిటెడ్ అధికారుల సంఘ నాయకులు గాదె శ్రీనివాస రెడ్డి, కె. యుగంధర్ కుమార్, బి. నవీన్ రాజు, సూర్యదేవర రమేష్ బాబు మినిస్టీరియల్ సంఘ నేతలు శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు టి. వివేకానంద, గద్దె తిలక్, పి.వి.సత్యనారాయణ, పి.ఎన్.వి. ప్రసాద్, గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## అమాయకత్వమా...అవివేకమా... అహంకారమా?

- ప్రజాప్రతినిధులను ఎందుకు పక్కన పెడుతున్నారు?
- నా నియోజకవర్గంలో నాకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమమా?
- ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం...
- విభజించు-పాలించు విధానంలో అధికారులు
- అధికారుల ధోరణిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అధికారుల వ్యవహారం పట్ల ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు తెలియకుండా ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం, ప్రోటోకాల్‌ను పూర్తిగా పక్కనబెట్టడం పై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆమె పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం సైక్లోన్ ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సరుకుల పంపిణీ జరుగుతుందని, గుంటూరు పశ్చిమలో కూడా ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే అదే సమయంలో అధికారులు మరో చోట వేరే కార్యక్రమం నిర్వహించి, తనకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

"నా నియోజకవర్గంలో నాకు తెలియకుండా కార్యక్రమం? ప్రోటోకాల్ ఎక్కడ? ప్రజాప్రతినిధులను ఎందుకు పక్కన పెడుతున్నారు? బ్యానర్లలో స్థానిక నాయకులు ఎందుకు లేరు?" అని ప్రశ్నించారు.

మేయర్, కమిషనర్ వర్గం నిర్వహించిన కార్యక్రమంలో తన ఫోటో లేకపోవటం, తాను నిర్వహించిన పంపిణీలో మేయర్, ప్రధానమంత్రుల చిత్రాలు లేకపోవడం అధికారి వ్యవస్థలో సమన్వయం లోపానికి నిదర్శనమని విమర్శించారు.

"ఇది అమాయకత్వమా? అవివేకమా? లేక అహంకారమా? రెండు కార్యక్రమాలు ఎందుకు? ఎవరి ప్లాన్ ఇది? ప్రభుత్వ కార్యక్రమం అందరూ కలిసి చేయాల్సింది, ఇలా విభజించు-పాలించు విధానం ఎందుకు?" అని ప్రశ్నించారు.

తాజాగా మెప్మా విభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు, ప్రధాని మోడీ చిత్రాలు లేకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తూ, "నాయకులను మర్చిపోయే పరిస్థితి ఎలా వస్తోంది?" అని వ్యాఖ్యానించారు.

అధికారులు ప్రజాప్రతినిధులను గౌరవించడం, సమన్వయం పాటించడం చాలా అవసరమని, ప్రజా సమస్యలు పరిష్కరించాలంటే ఇరువర్గాలు కలిసి పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. "ప్రజల సేవ కోసం మనం ఉన్నాము. అధికారులు, కాంట్రాక్టర్లు ఒకరిపై ఒకరు నెపం వేయకుండా పనిచేయాలి, రాష్ట్ర అభివృద్ధికి సమన్వయం అత్యవసరం," అని పేర్కొన్నారు.

24వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "సోషల్ మీడియాలో చూసే వరకు నాకు తెలియదు. ఇది ఎందుకు జరిగింది? ఎవరు కారణం?" అని ప్రశ్నించారు. అధికారులు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ఇంకా కూటమి ప్రభుత్వాన్ని అంగీకరించకుండా వ్యవహరిస్తున్నారా?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు.

గుంటూరు పశ్చిమలో ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, కొన్ని ప్రాంతాలను విస్మరిస్తున్న తీరు సరికాదని స్పష్టం చేశారు. సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, ప్రజాప్రతినిధుల గౌరవం కాపాడాలని ఎమ్మెల్యే మాధవి హెచ్చరికతో ఈ సమావేశం ముగిసింది.

## కోనసీమ జిల్లా మైనర్ బాలిక అత్యాచార ఘటనపై "మహిళా కమిషన్" సీరియస్

- చాక్లెట్లు ఆశచూపి బాలికపై లైంగికదాడి అమానుషం..
- కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పందన
- నిందితుడ్ని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు కోరుతూ కోనసీమ ఎస్పీ కి లేఖ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ. పోలవరం మండలం, బాణాపురం గ్రామంలో మైనర్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని చాక్లెట్లు ఆశచూపి లోబరుచుకున్న కీచకుడి ఉదంతం శుక్రవారం వెలుగుచూసింది. దీనిపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తక్షణమే స్పందించారు. వాస్తవాల నిర్ధారణకు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులను ఆదేశించి వివరాలు తెలుసుకున్నారు.

ఈ ఘటనను మహిళా కమిషన్ సూమోటోగా స్వీకరించి కోనసీమ జిల్లా ఎస్పీకి లేఖ రాశారు. బాధిత బాలిక చదివే పాఠశాలలో వాలీబాల్ కోచ్ గా పనిచేస్తూ.. చాక్లెట్లు ఆశచూపి బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద అరెస్టుతో కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ రాజకీయ పార్టీ వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనన్నారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి నివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పించాలంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు.

## పిఆర్సి కమిషన్‌ను వెంటనే నియమించాలి

- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్న నేపథ్యంలో, త్వరితగతిన పిఆర్సి కమిషన్‌ను నియమించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. పిఆర్సి అమలు కావాల్సిన తేదీకి రెండు సంవత్సరాలు దాటినా ఇంకా కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం విచారకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.


ప్రతి పది సంవత్సరాలకు కేంద్ర ప్రభుత్వం ముందుగానే పిఆర్సి కమిషన్‌ను నియమిస్తుందని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మూడు సంవత్సరాలు దాటినా కొత్త కమిషన్ ఏర్పాటు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై నుండి అమలు కావాల్సిన పిఆర్సి ఆలస్యమవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కేంద్రంలో వలే రాష్ట్రంలో కూడా ప్రతి ఆరు నెలలకు డీఏలను సమయానికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు డీఏలు పెండింగ్‌లో ఉండడంతో బకాయిలు 12 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని తెలిపారు.

దీంతో ప్రభుత్వానికి ఆర్థిక భారమూ, ఉద్యోగులకు సమస్యలూ పెరుగుతున్నాయని అన్నారు.

ఈ పరిస్థితుల్లో కనీసం 27% ఇంటర్మ్ రిలీఫ్ (ఐఆర్) ప్రకటించి, ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేయాలని కోరారు. రాష్ట్రంలో పిఆర్సి కమిషన్‌ను వెంటనే నియమించి, డీఏలను బకాయిలు లేకుండా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సంఘం కోరింది.

## శ్రీశైలం పాతాళగంగలో కృష్ణమ్మ హారతి వైభవం



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైల దేవస్థానంలో కార్తీకమాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన పాతాళగంగ కృష్ణమ్మ హారతి శోభాయమానంగా ముగిసింది. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 21 వం-కు జరగనున్న కార్తీకోత్సవాల్లో భాగంగా, కార్తీక రెండో శుక్రవారం సాయంత్రం ఈ పుణ్యకార్యక్రమం నిర్వహించారు.

పాతాళగంగ తీరం వద్ద ఏర్పాటు చేసిన కృష్ణవేణీ నదీమాత విగ్రహానికి పూజా కార్యక్రమాలు, వస్త్ర సమర్పణ వంటి వైదిక కర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కృష్ణానదీ తీరంలో ప్రత్యేక వేదికపై శ్రీస్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు, దశహారతులు సమర్పించారు. నదీమాతకు సారె సమర్పించి ఘనంగా హారతులు అర్పించారు. కార్యక్రమానికి ముందు అర్చకులు లోకకల్యాణం కోసం సంకల్ప పఠనం చేసి, మహాగణపతి పూజతో హారతి కార్యక్రమం ప్రారంభించారు. సంప్రదాయం ప్రకారం ఏకహారతి నుంచి కర్పూరహారతి వరకు మొత్తం పది రకాల దశహారతులు అర్పించబడ్డాయి. మన ఆధ్యాత్మికతలో నదులు మాతృస్వరూపమని, అవి జీవనాధారమని వ్యాఖ్యాతలు స్పష్టం చేశారు. పంచగంగల్లో ఒకటైన కృష్ణవేణీ ఉత్తరవాహినిగా శ్రీశైలంలో ప్రవహించడం వల్ల మరింత పవిత్రత కలిగి ఉందని చెప్పారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో నదీమాతకు హారతులు సమర్పించడం సంప్రదాయమని తెలిపారు.

ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు పుణ్యస్నానం చేసి హారతి దర్శనం పొందారు. భక్తుల భక్తి శ్రద్ధలతో, వేడుకల నడుమ ఈ దివ్య కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని దేవస్థానం అధికారులు తెలిపారు.

## ప్రజాసేవ, సామాజిక ప్రభావంలో నారా భువనేశ్వరి కృషికి గుర్తింపు

- ప్రతిష్టాత్మక సంస్థ ఐఓడీ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు
- కార్పోరేట్ రంగంలోనూ దార్శనిక నాయకత్వానికి గోల్డెన్ పీకాక్ అవార్డు
- లండన్ లో ఈ రెండు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకోనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ భువనేశ్వరి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రజాసేవ-సామాజిక ప్రభావం అంశంలో చేసిన కృషికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. భారత్ లోని ప్రముఖ సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (%×ాణ%) ఆమెను డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డుకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ప్రజా సేవ, సామాజిక ప్రభావం, నాయకత్వం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులకు ప్రతీ ఏటా ఈ అవార్డులకు ఐఓడీ ఎంపిక చేస్తుంది. 2025 ఏడాదికి గానూ డిస్టింగ్విష్డ్ ఫెలోగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న నారా భువనేశ్వరిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును ఇవ్వాలని నిర్ణయించింది. నవంబర్ 4 తేదీన లండన్ లో జరిగే గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ లో నారా భువనేశ్వరి ఈ అవార్డును స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార, సామాజిక, పరిపాలనా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. ఇంతకు ముందు ఈ ప్రతిష్టాత్మక అవార్డును భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో-ఛైర్మన్ గోపీచంద్ హిందూజా, ఆదిత్య బిర్లా గ్రూప్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ఛైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు అందుకున్నారు. ఈ అవార్డుతో అలాంటి విశిష్ట వ్యక్తుల జాబితాలో ఇప్పుడు నారా భువనేశ్వరి చేరనున్నారు. ప్రస్తుతం ఆమె నేతృత్వం వహిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, విపత్తు సహాయం లాంటి అంశాల్లో సేవ కార్యక్రమాలను నిర్వహిస్తోంది... ప్రజలకు సేవలందిస్తోంది. ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ఎన్టీఆర్ విద్యార్థి సహాయ పథకాలు, విపత్తు నిర్వహణ సేవలు, మహిళల ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందాయి. ప్రత్యేకించి తలసేమియా రోగులకు ఉచితంగా బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్స్ నిర్వహించటంతో పాటు దీనిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేరువైన సీఎం సతీమణి నారా భువనేశ్వరి ప్రజాసేవా నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారు.

**హెరిటేజ్ ఫుడ్స్ కు కార్పోరేట్ గవర్నెన్సు ఎక్సలెన్స్ లో గోల్డెన్ పీకాక్ అవార్డు**

నారా భువనేశ్వరి మహిళా నాయకత్వానికి స్ఫూర్తిగానూ నిలుస్తున్నారు. కార్పోరేట్ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ కు వైస్ చైర్ పర్సన్, ఎండీగా ఉన్న ఆమె... ఆ సంస్థను పారదర్శకత, సామాజిక బాధ్యతతో నడిపిస్తున్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మక డెయిరీ బ్రాండ్ గా హెరిటేజ్ సంస్థను తీర్చిదిద్దారు. సంస్థ ఎదుగుదల, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలతో పాటు కోట్ల మంది వినియోగదారులకు హెరిటేజ్ ఉత్పత్తులు చేరువ చేయటంలో నారా భువనేశ్వరిది కీలక పాత్ర. ప్రత్యేకించి హెరిటేజ్ ద్వారా రైతుల సాధికారితకు పెద్ద పీట వేస్తున్నారు. వాణిజ్య రంగంలో ఆమె అందిస్తున్న సేవలకుగానూ దేశంలోని అత్యంత శక్తివంతమైన మహిళా వ్యాపారవేత్తల్లో నారా భువనేశ్వరి ఒకరని 2013లోనే ఫార్చ్యూన్ ఇండియా పేర్కొంది. ఎఫ్ఎంసీజీ రంగంలో అత్యుత్తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న హెరిటేజ్ ఫుడ్స్ కు దక్కిన ఎక్సెలెన్స్ ఇన్ కార్పోరేట్ గవర్నెన్సు విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డును ఆ సంస్థ వీసీఎండీ హోదాలో నారా భువనేశ్వరి అందుకోనున్నారు. లండన్ లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఐఓడీ నుంచి ప్రతిష్టాత్మక అవార్డును ఆమె స్వీకరించనున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467